రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్ వార్త



## హోటల్స్‌ను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్

**కొడంగల్, జూన్ 29(ప్రభాతవార్త** మున్సిపల్ పరిధిలోని ఎస్‌వీఆర్ దాబాలో శనివారం మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్ అకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తన సిబ్బందితో వచ్చి దాబాలోని కిచన్ గదిలోని సరుకులను పరిశీలించారు. అడ్వాన్స్‌గా తెచ్చి ఫ్రిజ్‌లో పెట్టిన సామాగ్రి, సరుకులను పరిశీలించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతు సోమవారం నుంచిఫుడ్ ఇనిస్పెక్టర్‌ను తీసుకువచ్చి అన్ని హోటల్స్‌ను పరిశీలిస్తామని అన్నారు. ఇప్పటికి కొందరు రోడ్డుపై టిఫిన్‌లు ఇతర తినుబండారాలు మురుగు కాల్వలపై విక్రయిస్తున్నారని వీటిపై ప్రత్యేక దృష్టి సారిస్తామ ని తెలిపారు.



దాబాను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

## ఎపి డిప్యూటీ సిఎంకు కార్యకర్తల ఘనస్వాగతం



**శామీర్‌పేట, జూన్ 29, ప్రభాతవార్త** జనసేన అధినేత, ఎపి డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్‌కు తుర్కపల్లిలో జనసేన కార్యకర్తలు, అభిమానులు ఘనంగా స్వాగతం పలికారు. శనివారం శామీర్‌పేట లోని తుర్కపల్లిలో పవన్‌కళ్యాణ్‌కు ఘనస్వాగతం లభించింది. నగరం నుంచి కరీంనగర్ ప్రాంతంలోని కొండగట్టు శ్రీఆంజనేయస్వామి ఆలయానికి కాన్వా య్‌లో శామీర్‌పేట రాజీవ్‌రహదారి తుర్కపల్లి మీదుగా బయలు దేరారు. ఈ సందర్భంగ జనసేన నాయకులు, కార్య కర్తలు, అభిమానులు తుర్కపల్లి గ్రామం వద్ద జనసేన అధినేత, ఎపి డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్‌కు ఘనంగ స్వాగతం పలికారు. మేడ్చల్ నియోజ కవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనిఘనంగా స్వాగతం పలికారు.

# బోడుప్పల్‌లో నెగ్గిన అవిశ్వాస తీర్మాణం

### పదవులు కోల్పోయిన మేయర్, డిప్యూటీ మేయర్

**బోడుప్పల్, జూన్ 29 (ప్రభాతవార్త):** బోడుప్పల్ నగరపాలక సంస్థ మేయర్ సామల బుచ్చిరెడ్డి, డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీరవిగౌడ్‌లపై కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మాణం నెగ్గింది. దీంతో వారిద్దరు తమ పదవులను కోల్పోయారు. మేడ్చల్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం ఉదయం కీసర ఆర్డీఒ వెంకట ఉపేందర్‌రెడ్డి బోడుప్పల్ నగరపాలక సంస్థ కార్యాలయంలో అవిశ్వాసంపై ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. మేయర్‌తోపాటు మొత్తం 28 మంది కార్పోరేటర్లకుగాను 22మంది కార్పోరేటర్లు ప్రత్యేక సమావేశానికి హాజరయ్యారు. మేయర్, డిప్యూటీ మేయర్‌తోపాటు బిఆర్ఎస్ కార్పోరేటర్లు కాటపల్లి లతా రాంచంద్రా రెడ్డి, కొత్త శ్రీవిద్యా చక్రపాణిగౌడ్, ఇండిపెండెంట్‌గా గెలిచి బిఆర్ఎస్ చేరిన బందారం అంజలి శ్రీధర్‌గౌడ్, బిజెపి కార్పోరేటర్ సామల పవన్‌రెడ్డి తదితరులు సమావేశానికి హాజరు కాలేదు. కాంగ్రెస్ నుండి గెలిచిన ఆరుగురు కార్పోరేటర్లు, బిఆర్ఎస్ నుండి గెలిచి కాంగ్రెస్‌లో చేరిన 11 మంది కార్పోరేటర్లు, నలుగురు ఇండిపెండెంట్ కార్పోరేటర్లు ప్రత్యేక సమావేశానికి హాజరయ్యారు. మెజారిటీ సభ్యుల తీర్మాణం మేరకు మేయర్, డిప్యూటీ మేయర్లు తమ పదవులను కోల్పోయారు. బిఆర్ఎస్ పార్టీవారు తమ పార్టీ నుండి గెలిచిన కార్పోరేటర్లకు విప్ జారీ చేసినా వారు పట్టించుకోలేదు. పార్టీ విప్‌ను దిక్కరించి వారు అవిశ్వాస తీర్మాణాన్ని సమర్థించారు. బోడుప్పల్‌లో అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా మేడ్లిపల్లి పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.



బోడుపల్‌లో అవిశ్వాస తీర్మాణంలో పాల్గొన్న కార్పోరేటర్లతో మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి తోటకూరి వజ్రేష్ యాదవ్, తదితరులు



కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ గౌతమ్, అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

## పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను పరిష్కరించాలి

### సిసిఎల్‌ఏ కమిషనర్ నవీన్‌మిట్టల్

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూన్ 29, ప్రభాతవార్త** పెండింగ్‌లో ఉన్న ధరణి ధరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని సిసిఎల్‌ఏ కమిషనర్ నవీన్‌మిట్టల్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. శనివారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ గౌతమ్, అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డిలు పాల్గొన్నారు. నగరంలోని సిసిఎల్‌ఏ కార్యాలయం నుంచి సిసిఎల్‌ఏ కమిషనర్ నవీన్‌మిట్టల్ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగ ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు విచ్చిన ధరఖాస్తులలో ఎన్ని పరిష్కరించారని అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న ధరణి ధరఖాస్తులను పరిష్కరించటానికి ప్రత్యేక కార్యచరణ చేపట్టాలని తహసీల్దార్లు, ఆర్డీఓలు అదనపు కలెక్టర్, కలెక్టర్ స్థాయిలో పెండింగ్‌లో ఉన్న ధరఖాస్తులను వేగవంతంగ పూర్తి చేయాలన్నారు. సక్సేషన్, పెండింగ్ మొటేషన్ వంటి ధరఖాస్తుల రికార్డులను పరిశీలించి వెంటనే పరిష్కరించాలని ఆయన సూచించారు. అన్ని మాడ్యూల్స్‌లో దాఖలైన దరఖాస్తు ప్రక్రియలను వేగవంతం చేసి పరిష్కారానికి చేపడుతున్న చర్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని కమిషనర్ నవీన్‌మిట్టల్ కలెక్టర్లకు సూచించారు. కలెక్టర్ గౌతమ్‌తో పాటు జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ పార్టీ నాయకులు అధైర్యపడొద్దు

### ఎమ్మెల్యే యాదయ్య పదవీకి రాజీనామ చేయాలి

### రాష్ట్ర కనీస వేతనాల మాజీ చైర్మన్ నారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కనీస వేతనాల మాజీ చైర్మన్ పులుమామిడి నారాయణ

**చేవెళ్ల, జూన్ 29 ప్రభాతవార్త :** బీఆర్ఎస్ నాయకులు ఎవరూ ఆందోళన చెందవద్దని, బీఆర్ఎస్ శ్రేణులకు, కార్యకర్తలకు సీఎం కేసిఆర్ అండగా ఉంటారని రాష్ట్ర కనీస వేతనాల మాజీ చైర్మన్ పులుమామిడి నారాయణ అన్నారు. శనివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ....స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య కాంగ్రెస్ పార్టీలో కనీసం సమాచారం ఇవ్వకుండా రాత్రికి రాత్రే పార్టీ మారడం సరైంది కాదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఎమ్మెల్యే కాలె యాదయ్యకు ఎంతో చేసిందని, కన్నతల్లి లాంటి బీఆర్ఎస్ పార్టీని మోసం చేసిన ఎమ్మెల్యే కాలె యాదయ్యకు తగిన బుద్ధిచెప్పాలని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ పేద ప్రజలందరికి కూడా అందుబాటులో ఉంటూ శ్రీరామ రక్షగా ఉంటుందని ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. సర్పంచులు, ఎంపిటిసిలు అందరూ కూడా కాంగ్రెస్ పార్టీని ఎవరూ కూడా ఇష్టపడటం లేదని కాలె యాదయ్య తీసుకున్న నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. నాయకులతో ఎలాంటి చర్చలు జరపకుండా తాను పార్టీ మారడం సరైంది కాదన్నారు. తన వ్యక్తిగత స్వార్థాల కోసం పార్టీలో చేరడం అనేది సబబు కాదన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

## ఎన్‌పిఆర్‌డి డివిజన్ మహాసభల కరపత్రం ఆవిష్కరణ

**కొడంగల్, జూన్ 29ప్రభాతవార్త** వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డి) కరపత్రాన్ని శనివారం స్థానిక పోలీస్ సర్కిల్ కారా ్యలయంలో సీఐ శ్రీధర్‌రెడ్డి అవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతు వికలాంగుల హక్కుల జాతీయ వేదిక డివిజన్ సదస్సు నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. వికలాంగులు వారికి ఉన్న చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. వికలాంగుల హక్కుల జాతీయ వేదిక వికారాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కొడంగల్ డివిజన్ మహసభలను ఈనెల 30న 10 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. నేడు ప్రభుత్వం వికలాంగులకు కల్పించిన చట్టాలను అమలు పరుస్తామని అలాగే వికలాంగులకు పోలీసులు ఫ్రెండ్లీ పోలీసులుగా వ్యవహరిస్తారని మీకు మీ వైకల్యంపై ఎవరైనా అనుచితంగా మాట్లాడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. వికలాంగులను సకలాంగులతో సమానంగా చూడాలని అన్నారు. సమాజంలో వికలాంగులు అత్యున్నత స్థాయిలో ఎదగాలని అన్నారు. అలాగే వికలాంగులు ఆత ్మవిశ్వాసంతో పట్టుదలతో ముందుకు సాగాలని అన్నారు. సమాజంలో గౌరవంగా బతకడం కోసం వికలాంగులు వారి తెలివితేటలతో ముందుకు సాగాలని అన్నారు. వికలాంగులకు ఎవరైనా ఏదైనా సమస్యల సృష్టిస్తే పోలీసులకు సమాచారం అందిస్తే సమస్యను సృష్టించిన వ్యక్తిపై వికలాంగుల చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని సీఐ అన్నారు. జిల్లా అధ్యక్షులు జె.దశరథ్, మండల అద్యక్షురాలు కె.సావిత్రమ్మ, మండల కార్యదర్శి అనిమేష్, మారుతి పాల్గొన్నారు.



డివిజన్ మహాసభల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సిఐ



పదవీ విరమణ పొందిన ఎస్ఐ లకు వీడ్కోలు పలుకుతున్న పోలీసు అధికారులు

## పదవీ విరమణ పొందిన ఎస్ఐలకు ఘనంగా వీడ్కోలు

**వికారాబాద్, జూన్ 29, ప్రభాతవార్త:** సుధీర్ఘ కాలంగా పోలీస్ శాఖలో సేవలు అందించిన ముగ్గురు ఎస్ఐ లకు శనివారం జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. పదవీ విరమణ పొందినఎస్ఐ లు హతీరామ్, ఏ.నర్సింహులు, యు ఎస్ ల పదవి విరమణ కార్యక్రమం జిల్లా పోలీస్ కార్యాలయం లో జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో భాగంగా వారికిశాలువా, జ్ఞాపికలతో సత్కరించి భాజా భజంత్రులతో ఘనంగా వీడ్కోలు పలికారు. పదవి విరమణ పొందిన ముగ్గురు ఎస్ఐ లు హతీరామ్ 1989 సంవత్సరం లో ఉమ్మడి నల్గొండ జిల్లాలో, ఏ.నర్సింహులు 1989 సంవత్సరంలో ఉమ్మడి మెదక్ జిల్లాలో, యు ఎస్ 1984 సంవత్సరంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో పోలీస్ డిపార్ట్మెంట్‌లో పోలీస్ కానిస్టేబుల్ గా భర్తీ అయి హెడ్ కానిస్టేబుల్, ఏఎస్ఐ, ఎస్ఐ లుగా పదోన్నతి పొంది సేవలందించారని అధికారులు ప్రశంసించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పి మాట్లాడుతూ, ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ అనేది తప్పక ఉంటుందని, ముగ్గురు అధికారులు విధుల పట్ల అంకిత భావముతో ఉండి వారి యొక్క పూర్తి సర్వీస్ కాలములో ఎటువంటి రిమార్క్స్ లేకుండా సంపూర్ణ ఆరోగ్యముతో పదవీ విరమణ పొందడము గొప్ప విషయమన్నారు. వారి శేష జీవితము ు కుటుంబ సభ్యులతో సుఖ సంతోషలతో గడపాలని ఆకాంక్షించారు. పోలీసు శాఖ నుంచి రావాల్సిన అన్ని బెనిఫిట్స్ లనుఅందించడం జరుగుతుందని తెలిపారు. పదవి విరమణ పొందిన ముగ్గురు సబ్ ఇన్స్పెక్టర్ లకు ఎస్పీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ రవీందర్‌రెడ్డి, పరిగి డిఎస్‌పి కరుణాసాగర్ రెడ్డి, తాండూర్ డిఎస్‌పి బాలకృష్ణరెడ్డి, ఏఆర్ డిఎస్‌పి వీరేశ్, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు ఉపాధి అవకాశాలు కలిగేలా ఉండాలి

### స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి ప్రభాతవార్త :** పర్యావరణ పర్యాటక అభివృద్ధిలో భాగంగా పేదలకు ఉపాధి అవకాశాలు కలిగేలా ఉండాలని స్పికర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని స్టేట్ ఛాంబర్‌లో అనంతగిరి పర్యాటక అభివృద్ధిపై చేపట్టాల్సిన పనులపై అటవీ, దేవాదాయ, మిషన్ భగీరథ, భూగర్భ జలాల ,మున్సిపల్ విభాగాల అధికారులతో, చేవేళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి ,జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్‌లతో కలిసి శాసనసభ సభాపతి సమీక్షించారు. ఈ సందర్భంగా అధికారులను ఉద్దేశించి స్పికర్ మాట్లాడుతూ...జిల్లాలో పర్యావరణ పర్యాటక అభివృద్ధికి స్వచ్ఛ దర్శన్ పథకం కింద 110 కోట్ల రూపాయల నిధులు మంజూరు అయ్యాయన్నారు. ఇట్టి నిధులతో 213 ఎరాల్లో పనులు చేపట్టేందుకు ప్రణాళికల రూపొందించాలని ఆయన తెలిపారు..పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి సంబంధించి నిధులు వృదా చేయకుండా అవసరమైన పనులు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ ఖర్చుతో చేపడుతున్న పనులతో పేదలకు ఉపాధి కలిగేలా ఉండాలని అదేవిధంగా ఆదాయ వనరులపై నివేధిక రూపొందించాలని ఆయన సూచించారు. పర్యాటక అభివృద్ధిలో భాగంగా చెట్లను ఎక్కువగా తొలగించకుండా అభివృద్ధి పరచాలని తెలిపారు. ఏ ప్రాజెక్టులకు ఎంతెంత ఖర్చు పెడతారో స్పష్టమైన నివేదికలను అందించాలని సభాపతి సూచించారు. గతంలోనే పర్యాటక అభివృద్ధికి 225 కోట్లు మంజూరైనప్పటికి 25 కోట్లతోనే అభివృద్ధి పనులు చేశారని తెలిపారు. పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి చొరవ వల్ల కోట్‌పల్లి ప్రాజెక్టులో బోటింగ్ చేయడం వల్ల పర్యాటకుల సందడి పెరిగిందని, దీనివల్ల స్థానికులకు ఉపాదితో పాటు హైదరాబాద్ నుండి వికారాబాద్ వరకు రహదారులకు ఇరువైపులా ఎన్నో హోటళ్లు వెలిశాయని గుర్తు చేశారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ జిల్లా అధికారి రేణుక, ఇఇ సుందర్ ,అటవీశాఖ అధికారి జ్ఞానేశ్వర్, డివైఎస్ఓ హనుమంతరావు, మత్స్యశాఖ అధికారి సౌజన్య, దేవాదాయ శాఖ అధికారి నరేందర్, మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, ఎంపి విశ్వేశ్వర్ రెడ్డి, కలెక్టర్

## ఎన్‌ఎఫ్‌సీనగర్‌లో చోరీ

### బంగారు నగలు మాయం.. వరుస దొంగతనాలతో జనాలు బెంబేలు

**ఘట్‌కేసర్, జూన్ 29, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరుగుతున్న వరుస చోరీలతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లాలంటే భయంగా ఉందని ఎప్పుడు ఏకాలనీలో దొంగతనం జరుగుతుందోనని జంకుతున్నారు. ఘట్‌కేసర్ మున్సిపల్ పరిధిలోని పలు కాలనీల్లో రోజు రోజుకు దొంగతనాలు పెరిగిపోతున్నాయి. రాత్రి పూట పట్రోలింగ్ నిర్వహిస్తున్నామని పోలీసులు చెబుతునా ్న ఇళ్లలో చోరీలు మాత్రం ఆగడం లేదు. తాజాగా ఇంటి తాళం విరగ్గొట్టి బంగారం, నగదు అపహరించుకుపోయిన సంఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఘట్‌కేసర్ మున్సిపల్ ఎన్‌ఎఫ్‌సీనగర్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ నితిష్‌కుమార్ శ్రీవాత్సవ్ (35) ఈనెల 7వ తేదీ సాయంత్రం 4 గంటలకు ఇంటికి తాళం వేసి మియాపూర్‌లోని అద్దె ఇంటికి వెళ్లగా అతని సోదరుడు ఉత్తర్‌ప్రదేశ్‌కు వెళ్లారు. శు క్రవారం ఉదయం 6 గంటలకు తిరిగి ఇంటికి రాగా ప్రధాన తలుపు తెరచి ఉండటంతో వెంటనే బెడ్ రూమ్‌లోకి చూడగా బీరువా తెరచి ఉంది. బీరువాలో ఉన్న 2 బంగారు నాణెలు, ఒక జతచెవి రింగులు, ఒక బంగారు ఉంగరం, వెండి నాణెలు, నగదు కనిపించలేదు. తన అన్న బెడ్ రూమ్ కూడా తెరచి ఉండగా బీరువాలో ఏమి పోయాయో తెలియలేదని బాధితులు తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళం విరగ్గొట్టి బీరువాలోని బంగారు నగదు, వెండి నాణెలు, నగదు ఎత్తుకెళ్లారని బాధితుడు నితిష్‌కుమార్ శ్రీవాత్సవ ఘట్‌కేసర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రాములునాయక్ తెలిపారు.

# మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో గొడవ

### వైస్‌చైర్మన్‌కు గాయాలు : పోలీసులకు ఫిర్యాదు..8మందిపై కేసు నమోదు

**శామీర్‌పేట, జూన్ 29, ప్రభాతవార్త** తూంకుంట మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ప్రారంభంలోనే నిధుల కేటాయింపు విషయంపై చైర్మన్ కె.రాజేశ్వర్‌రావుతో కాంగ్రెస్ నాయకులు గొడవ పెట్టుకుని సమావేశం జరపవద్దని కౌన్సిలర్లు బైకాట్ చేస్తామని డిమాండ్ చేసినట్లు తెలిసింది. ఏమైనా ఉంటే సమావేశం తరువాత మాట్లాడుదాం, సమా వేశం జరుపుకుందామని చైర్మన్ కె.రాజేశ్వర్‌రావు అనటం, కమిషనర్ వెంకటగోపాల్ కూడ వారిని సముదాయించే ప్రయత్నం చేసినా ఫలించలేదని తెలుస్తుంది. సమావేశం జరుగుతున్న సమయంలో కాంగ్రెస్ నాయకులు వేణుగోపాల్‌రెడ్డితో పాటు పలువురు లోపలికి వచ్చి కుర్చీలు వేదికపైకి విసర టంతో వైస్‌చైర్మన్ పి.వాణివీరారెడ్డికి గాయాలు అయినట్లు సమాచారం. దీంతో ఈ విషయం వివా దస్పదంగ మారి, ఆమెకు గాయాలు కావటంతో మెడిసిటీ హాస్పిటల్‌కు చికిత్స నిమిత్తం తరలిం చటం, అదే విధంగ శామీర్‌పేట పోలీసులకు చైర్మన్ కె.రాజేశ్వర్‌రావు, వైస్‌చైర్మన్ పి.వాణి భర్త వీ రారెడ్డి, పి.మహిపాల్‌రెడ్డిలు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఈ విషయంపై దాడి చేసిన వారిపై చట్టరీత్య చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. దీంతో శామీర్‌పేట పోలీసులు ఈ విషయంపై 8మందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. శనివారం శామీ ర్‌పేట మండలం తూంకుంట మున్సిపల్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటుకు కమిషనర్, అధికారులు ఏర్పాట్లు చేశారు. కౌన్సిల్ సమావేశం ప్రారంభం లోనే కొందరు కౌన్సిలర్లు, నాయకులు గొడవలు ప్రారంభించటంతో ఎట్టకేలకు కౌన్సిల్ సమావేశం ప్రారంభంలోనే ఆటంకం కలుగటంతో సమావే శాన్ని ఇక కొనసాగించలేక పోయినట్లు సమాచారం. అయితే గతంలో జరిగిన చైర్మన్, వై స్‌చైర్మన్‌లపై పెట్టిన అవి శ్వాసం వీగిపోవటంతో నాటి నుంచి చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్ల వారి మధ్య విభేధాలు కొనసాగుతుందని చెప్పవచ్చు. అవిశ్వాస విషయం లో కొందరు కౌన్సిలర్లు డబ్బులు ముట్టిన విషయంతోనే వారి మధ్య విభేధాలు తారా స్థాయి కి చేరుతున్నట్లు దాడుల వరకు వచ్చింది.

## ప్రభుత్వభూములు కాపాడాలి



తహశీల్దార్ రజినికి వినతిపత్రం అందజేస్తున్న అఖిలపక్ష నాయకులు

**ఘట్‌కేసర్, జూన్ 29, ప్రభాతవార్త:** ప్రభుత్వ, గ్రామకంఠం, బఫర్‌జోన్లలో అక్రమణలపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని అఖిలపక్ష నాయకులు కోరారు. ఈమేరకు శనివారం అఖిలపక్ష బృందం ఘట్‌కేసర్ తహశీల్దార్ డిఎస్. రజనిని కలిసి వినతి పత్రం అందజేసింది. ఘట్‌కేసర్ మండలం చౌదరిగూడ సర్వే నంబర్ 867/1లోని అసైనీభూమిలో లేఔట్ చేసి ప్లాట్లు అమ్ముతున్నారని, ఘణాపూర్ వైపు లక్ష్మీనారాయణచెరువు ఎఫ్‌టిఎల్ బఫర్‌జోన్‌లో మట్టి పోసి పూడ్చివేశారని, జోడిమెట్ల డాక్టర్స్ కాలనీలో 4 వేల గజాల పార్కుస్థలాన్ని కబ్జా చేస్తున్నారని తెలిపారు. వెంకటాపూర్‌లో ప్రభుత్వభూమిని, నారాయణరావుకాలువను ఆక్రమంచి లేఔట్ చేస్తున్నారని, కాచవానిసింగారం ముత్వెల్లిగూడలో గ్రామకంఠం ఆక్రమిస్తున్నారని, ఘట్‌కేసర్ గురుకుల్ కళాశాల చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం చేయకపోవడంతో స్థలాలు అక్రమించే ఆస్కారముందని పేర్కొన్నారు. పోచారం మున్సిపల్ అన్నోజీగూడలో ప్రభుత్వభూమిని ఆక్రమించారని నారపల్లిలో పార్కు స్థలం నిర్మాణాలు చేస్తున్నారని విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని నాయకులు విజ్ఞప్తి చేశారు. ఘట్‌కేసర్ మున్సిపల్ బీఆర్ఎస్ అధ్యక్షులు బండారి శ్రీనివాస్‌గౌడ్, మండల టిడిపి అధ్యక్షులు వేముల సంజీవగౌడ్, మండల బిజెపి అధ్యక్షులు చలువాది ప్రవీణ్‌రావు, టీజేఎస్ రాష్ట్ర నాయకులు మారం లక్ష్మారెడ్డి, సీపీఐ జిల్లా నాయకులు కల్లూరి జయచంద్ర, సీపీఎం జిలా కార్యదర్శివర్గ సభ్యులు చింతల యాదయ్య, మండల కార్యదర్శి ఎన్.సబిత, మున్సిపల్ బీఆర్ఎస్ ప్రధానకార్యదరి ్శ బర్ల హరిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

# హత్య కేసును ఛేదించిన పోలీసులు

### అక్రమ సంబంధంతోనే భర్తను హత్య చేసిన భార్య

**దౌల్తాబాద్, జూన్ 29 ప్రభాతవార్త:** అక్రమ సంబంధం పెట్టుకుని సొంత భర్తనే హత్య చేసిన సంఘటన వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండలంలోని బిచ్చాల్ గ్రామంలో చోటు చేసుకుంది. దౌల్తాబాద్ ఎస్సై రవిగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం...ఈడిగి కొరిడె అశోక్‌గౌడ్(36) హైదరాబాద్‌లో నివాసం ఉంటూ పాప్‌కాన్ అమ్ముకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. గత ఐదు నెలల క్రౌతం సొంత గ్రామమైన బిచ్చాలకు తిరిగి వచ్చి ఇక్కడే ఉంటున్నాడు. దౌల్తాబాద్ మండలంలోని బిచ్చాల్ గ్రామంలో ఈ నెల 12న అర్ధరాత్రి సమయంలో గ్రామానికి చెందిన కొరిడె అశోక్‌గౌడ్ అనే వ్యక్తి భార్య రేణుక అదే గ్రామంలో ఉండే అనిల్ అనే వ్యక్తితో అక్రమ సంబంధం కొనసాగిస్తూ తన భర్త అడ్డుగా ఉన్నాడనే అనుమానంతో జూన్ 12న అర్ధరాత్రి సమయంలో రేణుక, అనిల్ ఇద్దరు కలిసి తన భర్త అశోక్ గౌడ్‌ను గొంతు నులిమి చంపి ఎవరికి అనుమానం రాకుండా మరుసటిరోజు ఉదయం అశోక్‌గౌడ్ మద్యం ఎక్కువ సేవించి చనిపోయాడని అందరిని నమ్మించి జూన్ 13న అందరి సమక్షంలో మృతుడు అశోక్‌గౌడ్ అంత్యక్రియలు పూర్తి చేశారు. తర్వాత మృతుడు అశోక్ అన్న అయిన కొరిడే నర్సింలుకు తన తమ్ముని చావుపై అనుమానం కలిగి జూన్ 18న దౌల్తాబాద్ స్థానిక పోలిస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఇట్టి ఫిర్యాదును ఎస్సై రవిగౌడ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా మృతుడి భార్య రేణుకా, బదిగే అనిల్ ఇద్దరు కలిసి వారి అక్రమసంబంధం విషయంలో అడ్డుతొలగించుకోవడానికి తన భర్తను చంపగా వారిద్దరిని పోలీసులు పట్టుకొని వారిపై మర్డర్ కేసు పెట్టి కోర్టుకు పంపండం జరిగిందని విలేకరుల సమావేశంలో ఎస్సై తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై రవిగౌడ్

## ఎమ్మెల్యే పదవీకి కాలె రాజీనామ చేయాలి

### బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చటారి దశరథ్

**చేవెళ్ల, జూన్ 29 ప్రభాతవార్త :** ఎమ్మెల్యే పదవికి స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య వెంటనే రాజీనామ చేయాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చటారి దశరథ్ అన్నారు. చేవెళ్ల మండల కేంద్రంలో ఎమ్మెల్యే కాలె యాదయ్యకు వ్యతిరేకంగా బీజాపూర్ రహదారిపై ఎమ్మెల్యే కాలె యాదయ్య దిష్టి బొమ్మను స్థానిక నాయకులతో కలిసి దహనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ....స్థానిక ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీలో చేరికపై తీవ్రంగా ఖండిస్తున్నట్లు, గత రెండుసార్లు కేసిఆర్ బీ ఫామ్ ఇచ్చి గెలిపించుకోవడం జరిగిందన్నారు. ఈ చేవెళ్ల ప్రాంతమంతా కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం ద్వారానే అభివృద్ధి చెందిందని తెలిపారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కానీ ఎవరూ కూడా చింతించకూడదన్నారు. వలసపక్షి లాగా అధికార పార్టీలోకి చేరడమే పది 10 సంవత్సరాలలో కుటుంబంలో ఉన్న ప్రతి ఒక్కరికి కొడుకుకు, కోడలికి, ఇంట్లో ప్రతి ఒక్కరికి జడ్పిటిసి, ఎంపిపి ఇలాంటి పోస్టులు ఎన్నో తమ స్వలోబాల కోసం పార్టీలో ప్రతి పోస్టు కుటుంబానికి దక్కాలనే కోణంలో ఆయన పది సంవత్సరాలు పనిచేశారని తెలిపారు. మేమంతా ఏకమై పార్టీ కొరకు, పార్టీ సిద్ధాంతాన్ని నమ్ముకుని ఉద్యమకారులుగా వాటిని బలోపేతం చేసాం.. కాంగ్రెస్ పార్టీలో గెలిచిన కాలె యాదయ్య నువ్వు బీఆర్ఎస్‌పార్టీలోకి వచ్చావన్నారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి అన్ని విధాల లబ్ధిపొంది ఎమ్మెల్యేగా గెలిచాక వ్యక్తిగత ప్రయోజనాల కోసం పార్టీ మారడంపై ఆగ్రహం వ్యక్త చేస్తూ చేవెళ్ల నియోజకవర్గం వ్యాప్తంగా ఎమ్మెల్యే కాలె దిష్టిబొమ్మలను తగులబెట్టామన్నారు. వెంటనే ఎమ్మెల్యే పదవికి రాజీనామ చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్వీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




## మనస్థాపంతో యువకుడి ఆత్మహత్య

**వికారాబాద్, జూన్ 29, ప్రభాతవార్త:** మనస్థాపంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన వికారాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వికారాబాద్ పట్టణం ప్రతాప్‌గిరి కాలనీకి చెందిన తరుణ్(20) గతంలో హైదరాబాద్ నగరంలో నివాసం ఉండేవాడు. ఆ సమయంలో తరుణ్ ఒక అమ్మాయితో ప్రేమలో పడ్డాడు. గత కొన్ని నెలల క్రితం వికారాబాద్‌కు వచ్చి కుటుంబ సమేతంగా నివాసం ఉంటున్నారు. ప్రేమించిన అమ్మాయి దూరం అయ్యిందని తరుణ్ తీవ్ర మనోవేదన చెందాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్ కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ నాగరాజు తెలిపారు.

# డిస్కం నెత్తిన మొండి బకాయిలు

**-గ్రేటర్‌లో రూ.380కోట్ల పెండింగ్ విద్యుత్ బిల్లులు**
**-అత్యధికంగా హైదరాబాద్ సౌత్ - రూ.83.4కోట్లు**
**-రాజేంద్రనగర్ సర్కిల్‌లో రూ.63.8 కోట్లు**
**-అత్యల్పంగా సికింద్రాబాద్ రూ.14.1కోట్ల బకాయిలు**

**హైదరాబాద్, జూన్ 29,ప్రభాతవార్త:** గ్రేటర్‌లో విద్యుత్ డిమాండ్ రోజురోజుకు పెరిగిపోతుంది. దీనికితోడు నష్టాలు కూడా పెరగుతున్నాయి. దీంతో గ్రేటర్ జోన్ పరిధిలోని ప్రతినెలా రూ.50-60కోట్లకు పైగా నష్టం వస్తోంది. గ్రేటర్ జోన్‌లో రోజూ సుమారు 50-60మిలియన్ల యూనిట్స్ సరఫరా చేస్తుండగా వాటిలో 10-11శాతం నష్టాలను రికార్డుల్లో చూపుతున్నారు. 9సర్కిళ్లలో మొత్తం 60లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉండగా వాటిలో కమర్షియల్,హెచ్‌టీ కనెక్షన్లు 7.21లక్షల వరకు ఉన్నాయి. వీటికితోడు ప్రతిఏడాది నగరంలో 10శాతం విద్యుత్ కనెక్షన్లు పెరుగుతున్నాయి. అయితే విద్యుత్ కనెక్షన్లు లక్షలో పెరుగుతున్నా సరఫరాలో నష్టాలను మాత్రం అధికారులు అరికట్టలేకపోతున్నారు. సాంకేతిక నష్టాల పేరుతో లెక్కలు చూపిస్తూ చేతులు దులుపుకుంటున్నారు. ముఖ్యంగా 9సర్కిళ్లలో 40శాతంగా నష్టాలు నమోదవుతున్నాయి. గత ప్రభుత్వంలో అధిక నష్టాలు వస్తున్న సర్కిళ్ల ను ప్రైవేట్ పరం చేస్తారనే ప్రచారం కూడా గతంలో జరిగింది. అయినా నష్టాలను నివారించుకునేందుకు అధికారులు పెద్దగా చర్యలు తీసుకోలేదు. దీంతో విద్యుత్ సరఫరా నష్టాలను అరికట్టకట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం నష్టాలు వచ్చే సర్కిళ్లను ప్రైవేట్‌కు అప్పజెపే ప్రయత్నం చేస్తుంది. అందులో భాగంగానే హైదరాబాద్ సౌత్ సర్కిల్‌ను పైలెట్ ప్రాజెక్ట్‌గా ఆదాని గ్రూప్‌కు అప్పజెప్పుతున్నట్లు తెలుస్తుంది.



**హైదరాబాద్ సౌత్ .83.5కోట్లు .. రాజేంద్రనగర్ 63.8కోట్లు**

గ్రేటర్‌లోని తొమ్మిది సర్కిళ్లలో గృహ ,కమర్షియల్ కేటగిరిలో 60లక్షల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటి నుంచి ప్రతినెలా 900కోట్ల వరకు వసూలవుతుంది. 2024 మే నెలనాటికి గ్రేటర్ జోన్ పరిధిలో రూ.380కోట్ల బకాయిలు ఉన్నాయి. పాతబస్తీ కేంద్రంగా ఉన్న హైదరాబాద్ సౌత్‌లో అత్యధికంగా రూ. 83.5కోట్లు, రాజేంద్రనగర్ సర్కిల్‌లో మరో 63.8కోట్లు వరకు పెండింగ్‌లో ఉన్నాయి. అలాగే హైదరాబాద్ సెంట్రల్ - రూ.45.4కోట్లు, సైబర్‌సిటీ -45.4కోట్లు, సరూర్‌నగర్ 27.51కోట్లు, హబ్సిగూడ -48.3కోట్లు, మేడ్చల్ 37.2, సికింద్రాబాద్ -14.1కోట్లు, బంజారాహిల్స్-15. 15 కోట్లు వరకు పెండింగ్ బకాయిలు ఉన్నాయి.

**చౌర్యం పెరిగినా చర్యలు శూన్యం**

ఏటాలక్షల్లో కొత్త విద్యుత్ కనెక్షన్లు పెరుగుతున్నా..డిస్కంకు దానికి అనుగుణంగా ఆదాయం పెరగటం లేదు. పలు ప్రాంతాల్లో గృహాలకంటూ విద్యుత్ కనెక్షన్లు తీసుకుంటూ వాటిని వాణిజ్యానికి వినియోగిస్తున్నారు. టిఎస్ఎస్‌పిడిసిఎల్ అధిక నష్టాలు గ్రేటర్ జోన్ పరిధిలో ఉంటున్నాయి. సర్కిళ్లలో విద్యుత్ చౌర్యా న్ని అరికట్టేందుకు విజిలెన్స్ అధికారులు నామమాత్రపు చర్యలు తీసుకుంటూ చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తునా న్నయి. పాతబస్తీతోపాటు చంచల్ గూడ, సంతోష్‌నగర్, భవానీనగర్, మాదన్నపేట్, యాకత్‌పురా, బేగం బజార్, సీతారాంబాగ్, ట్రూప్‌బజార్, మీరాలం ఫలక్‌నామా సైదాబాద్, బహదూర్‌పురా, కిషన్ బాగ్, ధూల్‌పేట్, మంగళ్ హాట్,మెహదీపట్నం వంటి ప్రాంతల్లో భారీగా విద్యుత్ చౌర్యం జరుగుతున్నట్లు తెలుస్తుంది.

అయితే అధికారులకు తెలిసినా వారిపై చర్యలు తీసుకోకపోవడం లేదనే విమర్శలు సైతం వినిపిస్తున్నాయి.

## తెలుగుజాతి శౌర్యం-మన్యంవీరుడు నృత్యరూపకం

**రవీంద్రభారతి, జూన్ 29 ప్రభాతవార్త :**
భారతదేశ స్వాతంత్ర్య సమరయోధులలో మహోన్నతవ్యక్తి, ఆంగ్లేయుల తూటాలకు అడ్డుగా గుండెను నిలిపిపోరాడి తెలుగుజాతి ధైర్యసాహసాలకు, శౌర్యానికి నిదర్శనంగా నిలిచిన అల్లూరి సీతారామరాజు జీవితకథను ప్రఖ్యాత నర్తకి పద్మశ్రీ డా. ఆనంద్‌శంకర్ జయంత్ దర్శకత్వంలో రూపొందిన మన్యంవీరుడు నృత్యరూపకం విచ్చేసిన అశేషప్రేక్షకులను గగుర్పొల్పి మంత్రముగ్ధులను చేసింది. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది వేడుకల్లో భాగంగా డ్యాన్స్ థియేటర్ ప్రొడక్షన్ నిర్మాణంలో భారత సాంస్కృతిక మంత్రిత్వశాఖ, శంకరానంద కళాక్షేత్ర సంయుక్త ఆధ్వర్యంలో రవీంద్రభారతి వేదికపై కళాక్షేత్ర బృందంలోని 21మంది నృత్యకళాకారులు, అతిథి కళాకారులు మిథున్‌శ్యామ్, సురేందర్‌నాథ్, హైదరాబాద్ బెంగళూరుకు చెందిన పలువురు యువ నృత్యకారులతో నిర్మాణంలో అల్లూరి సీతారామరాజు ఉత్తేజకర దేశభక్తిని సజీవంగా ఆహుతుల కరతాళధ్వనుల మధ్య అద్భుతంగా ప్రదర్శింపబడి ఎంతగానో ఆకట్టుకుంది. మార్షల్ ఆర్ట్స్, ఉత్కంఠభరిత పోరాట సన్నివేశాలు, భావోద్వేగాలతో కూడిన కొరియోగ్రఫీతో 45 నిమిషాల ఈ ప్రదర్శన కళ్లకుకట్టి మంత్రముగ్ధులను చేసింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథి డా. మామిడిహరికృష్ణ మన్యంవీరుడు కథను పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు తప్పక చూపించాలని కోరారు. హరికృష్ణ విశిష్ట అతిథులు మాజీ ఎమ్మెల్సీ ఎం.రామచందర్, రమాభరద్వాజ్, డా. ఆనంద్‌శంకర్ జయంత్‌లతో కలిసి కళాకారులను ఘనంగా సత్కరించారు.



మన్యంవీరుడు నృత్యరూపకంలోని దృశ్యాలు

## బహిరంగ ప్రదేశాలలో ఆసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

**-అత్తాపూర్ పరిధిలో కార్టన్ సెర్చ్**



**అత్తాపూర్ జూన్29,ప్రభాతవార్త :**
బహిరంగ ప్రదేశాలలో గంజాయి,మద్యం సేవిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్స్‌పెక్టర్లు వెంకటరామిరెడ్డి,మధుకర్,నాగేంద్రబాబులు హెచ్చరించారు. రాజేంద్ర నగర్ జోన్ డిసిపి ఆదేశాల మేరకు శనివారం అత్తాపూర్ పరిధిలోని జలాల్ బాబా నగర్,భూపాల్ నగర్‌లతో మొత్తం 24 ప్రాంతాలలో కార్టన్ సర్చ్ ఆపరేషన్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఇన్స్‌పెక్టర్లు మాట్లాడుతూ...బహిరంగ ప్రదేశాలలో గంజాయి ,మద్యం సేవిస్తూ జూదం ఆడటం మరియు ఆసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామని అన్నారు.అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని తెలిపారు.రాత్రి సమయంలో రోడ్డుల మీద విచ్చలవిడి తిరుగుతూ నిబంధనలు అతిక్రమించి ప్రవర్తిస్తే కఠినమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.ప్రతి ఒక్కరూ పోలిసు నిబంధనలను పాటిస్తూ పోలీసులు సహకరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ నగర్ ఇన్స్‌పెక్టర్స్, ఎస్ఐఎస్,స్పెషల్ పార్టీ ,టిఎస్ఎస్‌పి ఫోర్స్,తదితరులు పాల్గొన్నారు.

## హౌసింగ్ సొసైటీలో అక్రమాలను అడ్డుకొన్నందుకు జైలుకు పంపారు

**- చిత్రపురి కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు వల్లభనేని అనిల్**



చిత్రపురి కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షులు వల్లభనేని అనిల్.

**నార్సింగి, జూన్ 29 ప్రభాతవార్త :** చిత్రపురి హౌసింగ్ సొసైటీలో జరుగుతున్న అక్రమ రిజిస్ట్రేషన్లను అడ్డుకున్నందుకు నాపై తప్పుడు కేసులు పెట్టించి, జైలుకు పంపారని అధ్యక్షులు వల్లభనేని అనిల్ పేర్కొన్నారు. శనవారం చిత్రపురి కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1994.లో సీనియర్ నటులు ప్రభాకర్‌రెడ్డి చొరవతో 67.ఎకరాల 16.గుంటల భూమిని కేటాయించారని, ఇప్పటి వరకు 4,600.మంది సభ్యులకు రిఫెండం ఇచ్చామన్నారు. నాపై తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపడం వల్లనే కార్మికుల గృహ నిర్మాణాలు నిలిచిపోయాన్నారు. సినీ కార్మికుల కోసం ఎన్ని త్యాగాలకైనా సిద్దంగా ఉన్నానని తెలిపారు. త్వరలో జరుగనున్న జెనరల్ బాడీ సమావేశంలో నాపై చేసిన అభియోగాలపై సరైన సమాధానం ఇస్తానని వివరించారు. అవినీతి అంటు నిరాధార ఆరోపణలు చేయడం దారుణమన్నారు. అప్పుల పాలైన సొసైటీని బయట పడేసేందుకు మా కమిటీ రేయింబవళ్లు కష్టపడుతుందన్నారు.మేము బాధ్యతలు తీసుకున్నాక బాధ్యతాయుతంగా, పారదర్శకంగానే పనులు చేశామని, గత కమిటీలు చేసిన నష్టాలను సరి చేస్తూ వస్తున్నామన్నారు. సొసైటీ బైలాను అనుసరించి, గడువు తీరినా డబ్బులు చెల్లించని సభ్యులకు నోటీసులు అందజేసి, చర్యలు తీసుకున్నామన్నారు. గత సర్కారు మయాంలో 51.విచరాణలు వేశారని, మా హయాంలో కేవలం 20.సభ్యత్వాలు మాత్రమే ఇచ్చామన్నారు. ట్విన్ టవర్స్ ప్రాజెక్ట్ కూడా సొసైటీని ఆర్థిక ఇబ్బందుల నుంచి బయట పడేయాలన్న తపనతోనే చేపట్టామన్నారు. అవసరమైతే సొసైటీ రద్దుకు కూడా నేను సిద్దమేనని అనిల్ స్పష్టం చేశారు.

## కంటోన్మెంట్ అభివృద్ధికి నిరంతరం కృషి : ఎమ్మెల్యే శ్రీగణేష్



రైల్ నిలయం అంబేద్కర్ నగర్‌లో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

**కంటోన్మెంట్,జూన్ 29 ప్రభాతవార్త:**
కంటోన్మెంట్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలో్ల నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు దశాల వారిగా, ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. శనివారం మోండా డివిజన్‌లోని రైల్ నిలయం అంబేద్కర్ నగర్, టీచర్స్ కాలనీ, లోహియ నగర్, తారకరామ నగర్ పరిసర ప్రాంతాల్లో జలమండలి, విద్యుత్, జిహెచ్ఎంసి అధికారులతో కలిసి విస్తృతంగా పర్యటించారు. లోహియ నగర్‌లో మంచి నీటి ఎద్దడి తీవ్రంగా ఉందని, గతంలో వేసిన పవర్ బోర్‌వెల్‌కు మోటర్ బిగించకపోవడంతో నిరుపయోగకరంగా ఉందని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. అదే విధంగా రైల్ నిలయం అంబేద్కర్ నగర్‌లో నివాసం ఉంటున్న కొందరికి గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఇచ్చినట్టు ప్రకటించారు కానీ ఇండ్లు రాలేదన్నారు. స్థానికంగా నివాసం ఉంటున్న 45 కుటుంబాలకు రెవెన్యూ అధికారులు సర్వే జరిపారు కానీ, తమకు డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లు నిర్మించలేదని ఆయన దృష్టికి తెచ్చారు. డ్రైనేజీలు అస్తవ్యస్థంగా ఉన్నాయని, తాగునీటిలో మురుగు నీరుకలుషితం అవుతుందని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను నాలుగు రోజుల్లో పరిష్కరించాలని జలమండలి, విద్యుత్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్ల అంశంపై రెవెన్యూ అధికారులతో చర్చించి అర్హులైన లబ్ధిదారులకు న్యాయం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఆర్.డి.నాగేశ్ యాదవ్, సంతోష్ యాదవ్, బద్రినాథ్ యాదవ్, సురవి శ్యాంసుందర్ రెడ్డి, డి.బాబురావ్, రౌతు రాజయ్య, సాంబయ్య, మంద సురేశ్, బాబయ్య యాదవ్, సుందర్, శివ,జూలు, జలమండలి డిజిఎం, క్రిష్ణ, ఏఈ శ్రావంతి, శ్రీధర్, మేకల చందర్,శంకర్, తేజ్‌పాల్,నసదానంద్ గౌడ్, ధనలక్ష్మి, పాల్గొన్నారు.

## కాంగ్రెస్, బిఆర్ఎస్ మధ్య తోపులాట

**చెక్కుల పంపిణీలో ప్రొటోకాల్ వివాదం**

**పంజగుట్ట జూన్ 29, ప్రభాతవార్త:**
జూబ్లీహిల్స్ నియోజకవర్గ పరిధిలో లబ్దిదారులకు చెక్కుల పంపిణీ విషయంలో అధికార ప్రతిపక్ష నాయకుల మధ్య ప్రొటోకాల్ వివాదం ఏర్పడి ఇరువర్గాలు తోపులాడు కోవడంతో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. శనివారం ఉదయం ఖైరతాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో షాదీముబారక్ చెక్కుల పంపిణీకి రహ్మత్‌నగర్, బోరబండ డివిజన్‌లకు చెందిన లబ్దిదారులను అధికారులు ఆహ్వానించారు, ఈ కార్యక్రమానికి జూబ్లీహిల్స్ శాసనసభ్యుడు మాగంటి గోపీనాథ్ విచ్చేశారు, కాంగ్రెస్ నుండి కార్పొరేటర్‌భార్య హాజరుకావడంతో ఇదే విషయమై ఎమ్మెల్యే ప్రశ్నించడంతో అక్కడ గొడవ ప్రారంభమైంది. ఇరువర్గాలు ఎవరి వాదన వారు వినిపిస్తూ పెద్ద ఎత్తున కేకలకు దిగారు.దీంతో పరిస్థితి ఉద్రిక్తతగా మారడంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరువర్గాలను శాంతపరచారు.

## సిబ్బంది అనుక్షణం అంకితభావం పనిచేయాలి

**అత్తాపూర్ జూన్29,ప్రభాతవార్త :**
రైతాంగానికి నిరంతరం సేవలందించే అవకాశం కల్పించిన విశ్వవిద్యాలయ పురోగతికి సిబ్బంది అనుక్షణం అంకిత భావం,నిజాయితీతో పనిచేయాలని రాజేంద్రనగర్ ప్రొఫైసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్,పరిశోధన సంచాలకులు డాక్టర్ పి.రఘురామి రెడ్డి అన్నారు.గత కొన్నేళ్లుగా అనేక వేల మంది నిరంతరం శ్రమ తోనే నేడు విశ్వవిద్యాలయం ఉన్నత శిఖరాలు చేరుకోగలు తుందన్నారు.వారి స్ఫూర్తితో ప్రస్తుత సిబ్బంది పనితీరు సాగాలని రఘురామిరెడ్డి సూచించారు.ఈనెలాఖరుకి ఉద్యోగ విరమణ చేయనున్న విశ్వవిద్యాలయ డిన్ ఆఫ్ అగ్రికల్చర్ డాక్టర్ సీమ,విస్తరణ సంచాలకులు డా.వి.సుధారాణి,ఆఫీస్ సబార్డినేట్ బి.అశోక్‌ల ఉద్యోగ విరమణ వీడ్కోలు సమావేశం శనివారం రాజేంద్రనగర్‌లోని వాటర్ టెక్నాలజీ సెంటర్ ఆడి టోరియంలో జరిగింది.ఈ సందర్భంగా వారు దశాబ్ధాల పాటు విశ్వవిద్యాలయానికి అందించిన సేవల్ని రిజిస్ట్రార్ అభి నందించారు.అధికారికంగా సత్కరించారు.అదేవిధంగా అనేక మంది అధికారులు,సిబ్బంది కూడా ఉద్యోగ విరమణ చేస్తున్న వారిని అభినందించి సిబ్బంది కూడా ఉద్యోగ విరమణ చేస్తు న్న వారిని అభినందించి సత్కరించారు.వారితో ఉన్న అను బంధాన్ని నెమరు వేసుకున్నారు.ఇంతకాలం తమ విధుల నిర్వహణకి సహకరించిన విశ్వవిద్యాలయం సిబ్బందికి డాక్టర్ సీమ,డాక్టర్ సుధారాణి ,అశోక్‌లు ధన్యవాదాలు తెలిపా రు.ఈ కార్యక్రమంలో బోధన ,భోదనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## అల్వాల్‌లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటు చేస్తాం

**-ఎంపి ఈటెల రాజేందర్**

**అల్వాల్, జూన్ 29 ప్రభాతవార్త:** అల్వాల్‌లో సబ్ రిజిస్ట్రా ర్ కార్యాలయం ఏర్పాటుకు అన్ని చర్యలు తీసుకుంటానని మల్కాజిగిరి ఎంపి ఈటెల రాజేందర్ పేర్కొన్నారు. శనివా రం జిల్లా బిసి మోర్చా మాజీ అధ్యక్షుడు దండుగుల వెంక టేష్ ఆద్వర్యంలో నేతలు ఎంపిని కలిసి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమస్యను వివరించారు. అల్వాల్ ప్రాంతా నికి 14 కిలో మీటర్ల దూరంలోని బేగంపేట్‌లో ప్రస్తుతం కార్యాలయం ఉందని దండుగుల పేర్కొన్నారు. బస్సు సౌఖర్యం కూడా సక్రమంగా లేని ప్రాంతమన్నారు. ప్రతి మండల కేంద్రంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయని వివరించారు.

# చంపేశారు

**-వరుస హత్యల కలకలం**
**-వేర్వేరు ఘటనలో నలుగురు హత్య**





**హైదరాబాద్, జూన్ 29, ప్రభాతవార్త**
తన ప్రేమకు అడ్డు వస్తున్నాడని చెప్పి.. స్నేహితుడిని ఓ ఇంటర్ విద్యార్థి హత్య చేశాడు. ఈ హత్యను రైలు ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేశారు. కానీ పోలీసులకు నిందితులు అడ్డంగా దొరికిపోయారు.వివరాల్లోకి వెళ్తే..ఈ నెల 23వ తేదీన మూసాపేట వద్ద రైలు పట్టాలపై దానీష్ (17) అనే ఇంటర్ విద్యార్థి మృతదేహం లభ్యమైంది. దీంతో దానీష్ ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదని, తన కుమారుడు హత్యకు గురయ్యాడని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్త చేపట్టారు. దానీష్ సెల్‌ఫోన్ కాల్ డేటా ఆధారంగా పోలీసులు విచారణ చేపటాన్టరు. ఈనెల 22న రాత్రి 9.30 గంటలకు దానీష్ కు స్థానిక రౌడీషీటర్ కుమారుడు (17) ఫోన్ చేసినట్లు విచారణలో తేలింది. ఇక మద్యం సేవిం చిన రౌడీషీటర్ కుమారుడు తన 8 మంది స్నేహి తులతో కలిసి దానీష్‌పై బీరు సీసాలతో దాడి చేసి చంపారు. అనంతరం డెడ్‌బాడీని రైలు పట్టాలపై పడేసి వెళ్లిపోయారు నిందిఉలు. తన ప్రేమకు అడ్డు వస్తున్నాడని దానీష్‌పై రౌడీషీటర్ కుమారు డు పగ పెంచుకున్నాడని, ఈ క్రమంలో హత్యకు పాల్పడినట్లు నిర్ధారించారు. నిందితులు యూసు ఫ్‌గూడలోని ఓ కాలేజీలో ఇంటర్ ఫస్టియర్ చదువుతున్నారు.

**నార్సింగ్‌లో ఇంజనీర్ దారుణ హత్య..**

నార్సింగ్‌లో ఓ ఇంజనీర్ దారుణ హత్యకు గరయ్యాడు. ప్రాథమిక సమాచారం ప్రకారం.. ఇజాయత్ అలీ అనే ఇంజనీర్ 20 రోజుల కిందట దుబాయ్ నుంచి ఇండియాకు వచ్చాడు. అతడు శనివారం ఓ నిర్మానుష్య ప్రాంతంలో దారుణ హత్యకు గురయ్యాడు. ఓ కారులో వచ్చిన గుర్తు తెలియని దుండగులు అతడి గొంతు కోసి పరారైనట్లు తెలుస్తోంది. వారిలో ఇదన్దరు యువకులు కగా..ఓ యువతి ఉన్నట్లు సమాచారం. ఇద్దరు ఇంజనీర్ కాళ్ల పట్టుకొగా ఒకరు కత్తితో గొంతు కోసి పారిపోయినట్లు పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. అయితే, హత్య అనంతరం క్వాలిస్ వాహనాన్ని అక్కడే విడిచిపెట్టి పరారయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. నిందితుల వాహనాన్ని, రెండు ఫోన్లను సీజ్ చేశారు.

**జగద్గిరిగుట్టలో వ్యక్తి హత్య..**

జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధి వెంకటేశ్వరనగర్‌లో దారుణం చోటు చేసుకుంది. శుక్రవారం అర్థరాత్రి ఇంట్లో నిద్రిస్తున్న అనిల్ (40) అనే వ్యక్తిని కత్తులతో నరికి హత్య చేశారు గుర్తు తెలియని వ్యక్తులు.విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే ఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడు మెదక్ జిల్లా ముప్పారం గ్రామానికి చెందిన అనిల్ అని తెలిపారు పోలీసులు. అనిల్‌కు 6 అంబులెన్స్‌లున్నట్లు తెలిసింది. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అక్రమ సంబంధమే హత్యకు కారణమై ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

**హత్యకు గురైన రౌడిషిటర్..**

చాదర్‌ఘాట్‌లో రౌడీషీటర్ హత్య పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో జరిగిన హత్య భయబ్రాంతులకు గురిచేసింది.డబ్బుల కోసం వేధింపులకు గురిచేస్తుండడంతో రౌడీషీటర్‌ను హత్య చేసి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఇన్‌స్పెక్టర్ సైదులు కథనం ప్రకారం..యాకుత్‌పుర ప్రాంతానికి చెందిన రౌడీషీటర్ నజాఫ్ అలీ (46) వృత్తిరీత్యా వెల్డింగ్ పనుచేస్తుంటాడు. శుక్రవారం రాత్రి బందువులు ఫోన్ చేయడంతో మలక్‌పేట మెట్రోస్టేషన్ వద్దకు వెళ్లాడు. అప్పటికే నజాఫ్ అలీని అనుసరిస్తూ వచ్చిన ఇద్దరు యువకులు మలక్‌పేట మెట్రో స్టేషన్ వద్దకు నజాఫ్ అలీ రాగానే కత్తులతో దాడి చేసి గొంతు కోసి హత్య చేశారు. అనంతరం నిందితులు పారిపోయారు. కాగా హత్య చేసిన నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

## సాయిచంద్‌ను తెలంగాణ సమాజం మరువదు : కెటిఆర్, హరీష్‌రావు

**వనస్థలిపురం, జూన్ 29 ప్రభాతవార్త :**
తెలంగాణ ఉద్యమంలో తన పాట, మాటలతో తనదైన ముద్ర వేసిన ఉద్యమ గాయకుడు వేద సాయిచంద్‌ను తెలంగాణ సమాజం మరువలేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.తారకరామారావు, మాజీ మంత్రి టి.హరీష్ రావు తదితరులు అన్నారు. శనివారం హస్తినాపురంలోని జీఎస్ఎర్ కాన్వెన్షన్‌లో జరిగిన తెలంగాణ ఉద్యమ గాయకుడు వేద సాయిచంద్ ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతు తెలంగాణ ఉద్యమ కాలంలో సాయిచంద్ తన పాట, మాటలతో తెలంగాణను ఉర్రూతలూగించారని, ఆయన మరణం తీరనిలోటని అన్నారు. సాయిచంద్ కుటుంబ సబ్యులకు పార్టీ అండగా ఉంటుందని అన్నారు. మాజీ మంత్రి హరీష్‌రావు మాట్లాడుతు తెలంగాణ ఉద్యమంలో సాయిచంద్‌తో కలసి వేల కిలోమీటర్ల ప్రయాణించామని, సాయిచంద్ మన మధ్య లేకపోయినా తెలంగాణ ప్రజల గుండెల్లో ఉన్నారని అన్నారు. సాయి కేసీఆర్‌కు దగ్గరని, ఆయన లేకుండా కేసీఆర్ సభ భ్ అందది కాదని అన్నారు. సాయిచంద్ రాతి బొమ్మల్లోనా కొలువైన శివుడా పాట పాడుతుంటే లక్షలాది మంది కన్నీళ్లు పెట్టుకునేవారని అన్నారు. సాయిచంద్ జీవించి ఉంటే తప్పకుండా చట్టసభల్లో అడుగుపెట్టేవారని అన్నారు. మొన్నటి ఎన్నికల్లో సాయిచంద్ లేని లోటు కనిపించిందని అన్నారు. సాయిచంద్ భార్యా పిల్లలకు, తల్లిదండ్రులకు తాము అండగా ఉంటామని అన్నారు. ఈ సందర్భంగా సాయిచంద్ సతీమణి రజనీ మాట్లాడుతు సాయిచంద్ మరణం తర్వాత పార్టీ, ఉద్యమకారులు, కళాకారులు, అబ్యుదయవాదులు, అంబేద్కర్ వాదులు, పలు సంఘాల నాయకులు తమకు అండగా ఉన్నారని అన్నారు. రః సందర్భంగా పలువురు కళాకారులు రూపొందించిన సాయిచంద్ సంస్మరణ సంచికను కేటీఆర్ విడుదల చేశారు. దేశపతి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు ఎర్రోళ్ల శ్రీనివాస్, సత్తు వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.



సాయిచంద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న హరీష్‌రావు తదితరులు

## గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి...కొనుగోలు చేసిన ముగ్గురు అరెస్టు

**-1.5కిలోల గంజాయి స్వాధీనం**
**-మత్తుకు బానిసగా మారిన నీట్ పూర్వ విద్యార్థి**

**గచ్చిబౌలి, జూన్ 29 ప్రభాతవార్త**
గంజాయి విక్రయిస్తున్న ఓ సరఫరాదారుడితో పాటు కొనుగోలు చేస్తున్న ముగ్గురిని మాదాపూర్ పోలీసులు వలపన్ని పట్టుకున్నారు. వీరి వద్ద నుంచి 1.5కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కాగా గంజాయి కొనుగోలు చేస్తున్న పట్టుబడిన నిందితుల్లో త్రిచూర్ నీట్‌లో చదువుతూ మత్తుకు అలవాటుపడి చదువును మధ్యలోనే వదిలేసిన విద్యార్థి ఉండడం విశేషం. నీట్ పూర్వ విద్యార్థి మీద గతంలో సైతం నగరంలో గంజాయి, డ్రగ్స్ కేసులు నమోదయ్యాయి. టిజినాబ్, మాదాపూర్ పోలీసులు కలిసి చేధించిన ఈ కేసుకు సంబంధించిన వివరాలను శనివారం గచ్చిబౌలిలోని మాదాపూర్ డిసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాదాపూర్ డిసిపి వినీత్, టిజినాబ్ ఎస్‌పి సాయి చైతన్యలు వెల్లడించారు...
నగరంలోని దూద్‌బౌలికి చెందిన మోతీకార్ సచితా ఆనంద్(28) దూల్‌పేటకు చెందిన రాజాతో కలిసి గతకొంత కాలంగా నగరంలో గంజాయి విక్రయిస్తున్నాడు. శుక్రవారం మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హైటెక్స్ వద్ద ఆనంద్ గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందుకున్న టిఎస్‌నాబ్, మాదాపూర్ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడిలో సచితా ఆనంద్‌తో పాటు గంజాయి కొనుగోలు చేసేందుకు వచ్చిన సికింద్రాబాద్‌కు చెందిన నీట్ పూర్వ విద్యార్థి రాథోడ్ నవీన్ నాయక్(27), కూకట్‌పల్లికి చెందిన ఇంటీరియర్ డిజైనర్ ప్రణీత్‌రెడ్డి(25), బోయిన్‌పల్లికి చెందిన రాహుల్ రాజ్(27)లు పట్టుబడ్డారు. పట్టుబడిన నిందితుల వద్ద నుంచి పోలీసులు 1.5కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కాగా ఈ దాడిలో ఆనంద్‌తో పాటు గంజాయి వ్యాపారం చేస్తున్న రాజా పరారయ్యాడు. ఆనంద్‌ను విచారించగా బెంగళూరుకు చెందిన రిత్విక్, ఇంతియాజ్, జీవన్, మహేశ్, గచ్చిబౌలికి చెందిన హరీష్‌రెడ్డి, వైజాగ్‌కు చెందిన మ్యాక్సి, గౌలిదొడ్డికి చెందిన సచిన్‌ల వద్ద కొనుగోలు చేసినట్లు వెల్లడించాడు. ఈమేరకు నిందితులను అరెస్టు చేసిన పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

**మత్తుకు బానిసగా మారిన నీట్ విద్యార్థి...**

కాగా గంజాయి కొనుగోలు చేస్తూ పట్టుబడిన రాథోడ్ నవీన్ నాయక్ త్రిచిలోని నీట్ పూర్వ విద్యార్థి కావడం విశేషం. చదువులో ఎంతో ముందుండే నవీన్ నాయక్ ఆల్ ఇండియా 800 ర్యాంక్ సాధించి త్రిచిలోని నీట్‌లో చేరాడు. అక్కడ స్నేహితుల చెడు సహవాసంతో గంజాయి, డ్రగ్స్‌కు బానిసగా మారిన నవీన్ నాయక్ చదువు పూర్తి చేయకుండానే నీట్‌ను వదిలేశాడు. మత్తుకు పూర్తిగా బానిసగా మారిన నవీన్ బెంగళూరు, అహ్మదాబాద్ తదితర నగరాలకు వెళ్లి నిషేదిత ఎండిఎంఎ, గంజాయిలను తెచ్చుకొని సేవించేవాడు. తన ఇంటికి సైతం దూరం కావడంతో డబ్బు కోసం అదే గంజాయి, ఎండిఎంఎ విక్రయించసాగాడు. ఈ క్రమంలో గతంలో దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మరో నలుగురితో కలిసి ఎండిఎంఎ విక్రయించిన కేసు నమోదు కాగా, కేరళలోని పాలక్కాడ్‌లో సైతం నవీన్ మీద కేసు నమోదైంది. నవీన్ మత్తుకు బానిసగా మారడంతో ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న అతని తల్లిదండ్రులు సైతం అనారోగ్యం బారిన పడినట్లు పోలీసులు తెలిపారు. తల్లిదండ్రులు పిల్లల మీద పర్యవేక్షణ ఉంచాలని పోలీసులు సూచించారు. కాగా పట్టుబడిన నవీన్ మాట్లాడుతూ నీట్‌లో చేరిన తరువాత స్నేహితుల ద్వారా గంజాయి, డ్రగ్స్ అలవాటు అయ్యిందని, తరువాతి కాలంలో బానిసగా మారానన్నాడు. తనవంటి పరిస్థితి మరొకరు తెచ్చుకోవద్దని, ఒత్తిడిని జయించేందుకు ఎన్నో మార్గాలు ఉన్నాయన్నారు. తాను మత్తు నుంచి బయటపడేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపాడు.





సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న మాదాపూర్ డిసిపి వినీత్, టిఎస్‌నాబ్ ఎస్‌పి సాయి చైతన్య



ఓటు హక్కును వినియోగించుకుంటున్న విద్యార్థులు

## చదువుతో పాటు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలి

**తాండూరు, జులై 29, ప్రభాతవార్త :** విద్యార్థులు చిన్నప్పటి నుంచి చదువుతో పాటు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని క్రిష్ణవేణి కాన్సెప్ట్ పాఠశాల ప్రిన్సిపాల్ ప్రశాంత్ అన్నారు. తాండూరు పట్టణం పోట్లిమహారాజ్ ఆలయంలోని క్రిష్ణవేణి కాన్సెప్ట్ పాఠశాలలో 2024- 25 సంవత్సరానికి వివిధ విభాగాలలో పాఠశాల విద్యార్థి సంఘం ఎన్నికలు నిర్వహించారు. ప్రతి సంవత్సరం పాఠశాలలో సాంస్కృతిక విభాగం, క్రీడలు, క్రమశిక్షణ, స్వచ్ఛత తదితర విభాగాలలో నైపుణ్యం పెంచేందకు మాక్ ఎలక్షన్ నిర్వహించి విద్యార్థి నాయకులను ఎన్నుకుంటారు. ఈ ఎన్నికల్లో పాఠశాలలోని 3వ తరగతి నుండి 10వ తరగతి వరకు విద్యార్థులు ఉత్సాహంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ప్రశాంత్ మాట్లాడుతూ.. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు నాయకత్వ లక్షణాలతో పాటు ఓటు హక్కు వినియోగించుకోవడం పట్ల అవగాహన పెరుగుతుందని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు, క్రమశిక్షణ, నాయకత్వం, ప్రశ్నించే తత్వం ఏర్పడుతుందని, వారిలో భయం తొలిగిపోతుందని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులచే పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాద్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సతీష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానం ప్రాణదానంతో సమానం

### గర్భిణీకి రక్తదానం చేసిన వైద్యులు డాక్టర్ సంపత్‌కుమార్

**తాండూరు, జులై 29, ప్రభాతవార్త :** రక్తదానం ఆపదలో ఉన్న వారికి ప్రాణదానంతో సమానమని తాండూరు పట్టణంలోని బాలాజీ నర్సింగ్ హోం అధినేత డాక్టర్ సంపత్‌కుమార్ అన్నారు. శనివారం తాండూరు పట్టణంలోని ప్రభుత్వ మాతా శిశు ఆసుపత్రిలో ప్రసవం కోసం వచ్చిన ఓ గర్భిణీకి ఆయన రక్తదానం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. కోడంగల్ మండలం దౌల్తాబాద్ గ్రామానికి చెందిన మద్దూరు మహేష్ భార్య హర్షిత నిండు గర్భిణి. ప్రసవం కోసం కుటుంబసభ్యులు ఆమెను తాండూరులోని మాతా శిశు ఆసుపత్రికి తీసుకువచ్చారు. హర్షినికి రక్తం తక్కువగా ఉండటంతో విషయం తెలుసుకున్న డాక్టర్ సంపత్‌కుమార్ జిల్లా ఆసుపత్రికి చేరుకొని గర్భిణీకి రక్తదానం చేశారు. ఈ సందర్భంగా కుటుంబసభ్యులు డాక్టర్ సంపత్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## నాటు సారాను తయారుచేస్తే కఠిన చర్యలు

### అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ జీవన్ కిరన్


బెల్లం పానకాన్ని ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

**పెద్దేముల్, జూన్ 29, ప్రభాతవార్త:** నాటు సారాను తయారుచేసిన, విక్రయించిన కఠిన చర్యలు తప్పవని జిల్లా అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ జీవన్ కిరన్ హెచ్చరించారు. జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయబాస్కర్‌గౌడ్ ఆదేశాల మేరకు ఎఈఎస్ అధ్వర్యంలో శనివారం పెద్దేముల్ మండలంలోని పాషపూర్‌తాండా, రాంసింగ్ తాండా, ఓంలానాయక్‌తాండాలలో నాటు సారా స్థావరాలపై దాడులు చేశారు. నాటు సారాకు ఉపయోగించే 600 లీటర్ల పులియబెట్టిన బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. ఇట్టి పానకాన్ని నిలువ ఉంచిన పాషపూర్‌తాండాకు చెందిన రాథోడ్ రాములు, కిషన్, రాథోడ్ సుభాష్‌లపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఎఈఎస్ జీవన్‌కిరన్ మాట్లాడుతూ నాటు సారా తయారుచేసిన, విక్రయించినచర్యలు తప్పవని హెచ్చరించారు. ఉపాధి కోసం ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని, వాటిని సద్వినియోగం చేసుకొని తమజీవనోపాధిని మెరుగు పరుచుకోవాలని సూచించారు. ప్రభుత్వ నిషేధిత సారాను తయారుచేసి మరోమారు పట్టుబడితే రూ. 2 లక్షల జరిమానా లేదాజైలు శిక్ష తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తాండూరు ఎక్సైజ్ సిఐ బాలగంగాధర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, వికారాబాద్, తాండూరు,మోమిన్‌పేట ఎస్‌హెచ్‌ఓ అధికారులు, ఎక్సైజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ప్రభుత్వ సూచనల సర్వసభ్య సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్,డిసిఎంఎస్ వైస్‌చైర్మన్ ఆర్.మధుకర్‌రెడ్డి,పాల్గొన్న ఎంపిపి డి.ఎల్లుబాయిబాబు, వైస్‌చైర్మన్,డైరక్టర్లు, అధికారులు,రైతులు

**శామీర్‌పేట, జూన్ 29, ప్రభాతవార్త** తెలంగాణ ప్రభుత్వ సూచనల మేరకు రైతుబంధుపై రైతులతో చర్చించటానికి ప్రత్యేక సర్వసభ్య సమావేశంను జరుపటం జరిగిందని శామీర్‌పేట రైతు సేవా సహకార సంఘం చైర్మన్,డిసిఎంఎస్ వైస్‌చైర్మన్ ఆర్.మధుకర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం శామీర్‌పేట రైతు సేవా సహకార సంఘంలో ప్రత్యేక సర్వసభ్య సమావేశం చైర్మన్ మధుకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. శామీర్‌పేట మండల కేంద్రంలోని రైతు సేవా సహకార సంఘం ఉమ్మడి మండల సంఘ రైతులతో ప్రభుత్వ సూచనల మేరకు రైతుబంధు విషయంపై చర్చించారు. ఈ సందర్భంగ చైర్మన్ ఆర్.మధుకర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే రైతు బంధు పై రైతులకు సూచనలు తెలియజేశారు. సంబంధిత అధికారులు కూడ ఈవిషయంపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో శామీర్‌పేట ఎంపిపి డి.ఎల్లుబాయిబాబు, సొసైటీ వైస్‌చైర్మన్ ఐలయ్యయాదవ్, పలువురు డైరక్టర్లు, సంబంధిత అధికారులు, సిఇఓ,సంఘ రైతులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న జాతీయస్థాయి హ్యాకథాన్

**ఘట్‌కేసర్, జూన్ 29, ప్రభాతవార్త:** ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళితే విజయం సాధించవచ్చని ఇన్ఫోసిస్ ప్రతినిధి మనీష్ ముత్యపు అన్నారు. ఘట్‌కేసర్ మండలం వెంకటాపూర్‌లోని అనురాగ్ విశ్వవిద్యాలయం సీఎస్ఈ విభాగం ఆధ్వర్యంలో జాతీయ స్థాయి హ్యాకథాన్ టెక్‌హ్యాక్ 3 అట్టహాసంగా ప్రారంభం అయ్యింది. ప్రారంభోత్సవ కార్యక్రమంలో విశిష్ట అతిధులుగా మనీష్‌గుప్త అడ్వయిజర్ ఎస్ఏపీ, ఇన్ఫోసిస్ మనీష్ ముత్యపు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగమైనా ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అయినా ప్రణాళిక బద్ధంగా నియమ నిబద్ధతలతో కూడిన కఠోర పరిశ్రమ ఉంటేనే విజయం సాధిస్తారని తెలిపారు ఈకార్యక్రమంలో అడ్మిషన్స్ డీన్ మహిపతి శ్రీనివాస్‌రావు, సమన్వయ కర్తలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


సమావేశంలో అభిప్రాయాలను తెలుపుతున్న రైతులు

## సాగు చేసే ప్రతి ఎకరానికి రైతు భరోసా ఇవ్వాలి

### రుణమాఫీకి కటాఫ్ తేదిని ఎత్తివేసేలా చొరవ చూపాలి

### రైతు భరోసా అభిప్రాయ సేకరణలో వెల్లడించిన రైతులు

**పెద్దేముల్, జూన్ 29, ప్రబాతవార్త:** సాగు చేసే ప్రతి ఎకరానికి రైతు భరోసా ఇవ్వాలని రైతులు నరేష్‌రెడ్డి,బసిరెడ్డి, లాజర్, రవి, లాలప్ప, రాములు యాదప్ప తదితరులు తమ అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు. శనివారం పెద్దేముల్ మండల కేంద్రంలోని రైతు వేదిక సెంటర్‌లో ప్రభుత్వ అధికారులు రైతు భరోసా అభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల రైతులు మాట్లాడుతూ ఫామ్‌హౌస్‌లకు, బీడు భూములకు, వెంచర్లకు, ప్రభుత్వ ఉద్యోగులకు, బడానాయకులకు రైతు భరోసా ఇవ్వరాదని సూచించారు. వ్యవసాయదారునికి వ్యవసాయమే మార్గమమని, అందుకు రైతుకు న్యాయము చేసేందుకు సాగు చేసే ప్రతి ఎకరానికి రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. రుణమాపీకి కటాఫ్ తేదిని ఎత్తివేసేలా ప్రభుత్వం చొరవ చూపాలని అన్నారు. తాము తీసుకున్న రుణాలను చెల్లించడానికి చేతకాకనే రెన్యువల్ చేయలేకపోయామని అందుకు కటాఫ్ తేదిల పేరిట కొర్రిల పెట్టకుండా రుణమాపీని ప్రతిఒక్కరికి వర్తించేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం కటాఫ్ తేదిల పేరిట కొర్రిలు పెట్టడంతోతమకు గత ప్రభుత్వంలో, ప్రస్తుత ప్రభుత్వంలో రుణమాఫీ వర్తించడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. రైతు సంక్షేమం కోసం సిఎం రేవంత్‌రెడ్డి సర్కార్ కృషిచేస్తోందని ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నామని అందుకు అర్హులైన ప్రతిఒక్కరికి రుణమాపీ చేయాలని విన్నవించారు. మెజార్టీ శాతం రైతులు 10 ఎకరాల వరకు రైతు భరోసా ఇవ్వాలని తమ అభిప్రాయాలను వ్యక్తంచేశారు. జిల్లా సహకార అధికారి ఈశ్వరయ్య మాట్లాడుతూ రైతుల అభిప్రాయాలను ప్రభుత్వానికి నివేదిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్‌సిఎస్ చైర్మెన్ ద్యావరి విష్ణువర్ధన్‌రెడ్డి, ఏఆర్ చంద్రయ్య, ఏడిఏ రుద్రమూర్తి, మండల వ్యవసాయ అధికారి నసీరుద్దిన్, సొసైటి మెనేజర్ మురళి గౌడ్, డైరెక్టర్లు గెమ్యానాయక్, గోపాల్, సొసైటి సిబ్బంది ఫయాజ్, ప్రవీన్, పెంటప్ప, మాణెప్ప తదితరులు పాల్గొన్నారు.

## రోడ్లపైనే వీధి వ్యాపారం

### అడ్డగోలుగా పార్కింగ్.. ప్రయాణాల రాకపోకలకు అంతరాయం

### పోలీసులు పట్టించుకోవాలని వినతి



**ఆమనగల్లు, జూన్29, ప్రభాతవార్త:** ఆమనగల్లు పట్టణంలో ఫుట్‌పాత్ వ్యాపారం ప్రయాణాలకు రోజురోజుకు సమస్యగా మారిపోతుంది. వీధివ్యాపారులు మితిమీరి ప్రవర్తిస్తుండడంతో అది ప్రజాసమస్యకు దారి తీస్తుంది. పట్టించుకోవలసిన అధికారులు, పాలకులు చూసి చూడనట్లు వ్యవహరిస్తుం డడంతో వీధి వ్యాపారం రోడ్డుమీదకి వచ్చి వాహనాల రాకపోకలకు తీవ్ర విఘాతం కల్గిస్తున్నది. అటు పోలీస్, ఇటు ట్రాఫిక్‌తోపాటు మున్సిపాలిటీశాఖల సమన్వయం లోపంతో పట్టణంలో ట్రాఫిక్ సమస్య, ప్రమాదాలకు దారి తీస్తుంది. కాగా ఆమనగల్లు పోలీస్‌స్టేషన్‌కు కొత్తగా విచ్చేసిన సబ్‌ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌కు ట్రాఫిక్ సమస్య సవాలుగా విసురుతుందని పలువురులు అభిప్రా యం వ్యక్తం చేస్తున్నారు. గతంలో వీధివ్యాపారాన్ని రోడ్డుమీదకి రాకుండా కట్టడి చేసిన అధికారులు సఫలీకృతులయ్యారు. కానీ కొంతకాలంగా ఆక్రమణ లను పట్టించుకోక పోవడంతో పట్టణంలోని ప్రధాన వాణిజ్య కేంద్ర ప్రాంతాల్లో వీధివ్యాపారం, అడ్డగోలు పార్కింగ్ ఎవ్వరికి వారే యమునా తీరే అన్న ఛంధంగా తయారైందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఆమనగల్లు పట్టణంలోని హైదరాబాద్- శ్రీశైలం జాతీయ రహదారి, మాడ్గుల-షాద్‌నగర్ రహదారులు తరచూ ట్రాఫిక్ సమస్యను ఎదుర్కొంటున్నాయి. రోడ్డుమీదనే వాహనాలు పార్కింగ్ చేయడంతో భారీ వాహనాలు, ఆర్టీసీ బస్సులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. గంటల కొద్ది వాహనాలను రోడ్డుమీదనే ఉంచడంతో జాతీయ రహదారిపై తరచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది. ఆమనగల్లులో ట్రాఫిక్‌శాఖ సిబ్బంది లేకపోవడంతో ట్రాఫిక్ సమస్య పోలీస్‌శాఖ భుజాలపైనే పడిఉందం టున్నారు. అందుకనుగుణంగా కొత్తగా వచ్చిన ఎస్సై ఎంతమేరకు ట్రాఫిక్ సమస్యకు పరిష్కరం చూపుతాడోననే ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## డాక్టర్ ఆంజనేయులును ఆదర్శంగా తీసుకోవాలి: ఎమ్మెల్సీ


సన్మాన సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

**కొందుర్గు, జూన్ 28, (ప్రభాతవార్త) :** ప్రజలకు సంక్షేమ పథకాలు అందించేందుకు ఎంతో కృషి ఏసి అంకిత భావంతో విధులు నిర్వర్తించి పదవి విరమణ పొందుతున్న ఎంపీడీఓ ఆంజనేయులును ఉద్యోగులందరూ ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి కోరారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులతో పాటు మండల ప్రజల నుంచి ఇంత ప్రేమ అభిమానాలు పొందటం చాలా సంతోకరమని కొనియాడారు. ఇంకా జిల్లా డీప్యూటీ సీఈఓ రాంగారావు, వివిధ మండలాల ఎంపీడీఓలు, ఎంపీపీ జంగయ్య, వైస్ ఎంపీపీ రాజేష్‌పటేల్, వివిధ గ్రామాల ఎంపీటీలు, తాజా మాజీ సర్పంచులు వివిధ పార్టీల నాయకులు కార్యకర్తలు, వివిధ కార్యాలయలా ఉద్యోగ సిబ్బంది, ఉపాధ్యాయుల, యువజన, మహిళ సంఘాల సభ్యులు ఆయన కుటుంబ సభ్యులు బంధుమిత్రులు అధిక సంఖ్యలో పాల్గొని ఆయనను ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.

### అంకిత భావంతో సేవలందించిన అధికారి ఆంజనేయులు : ఎమ్మెల్యే

తన విధి నిర్వహణలో ఎంతో అంకిత భావంతో ప్రజలకు సేవలందించిన అధికారి డాక్టర్ ఆంజనేయులు అని ఎమ్మెల్యే శంకరయ్య అన్నారు. శనివారం నాడు స్థానిక జీఎం పటేల్ పంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసి స్థానిక మండల పరిషత్ అభివృద్ధి అధికారి డాక్టర్ ఆంజనేయులు పదవీ విరమణ సన్మాన మహోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ఎంపీడీఓను శాలువతో సన్మానించారు.

### ప్రజల సమస్యలు తీర్చాడమే ఆయన ఆశయం : మాజీ

ప్రభుత్వం ప్రవేశపెట్టిన అన్ని పథకాలు అర్హులకు అందేలా చూడటమే తన ధ్యేయంగా ఎంపీడీఓ డాక్టర్ ఆంజనేయులు విధులు నిర్వర్తించారని మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ కొనియాడారు. అంతనుకుముందు ఆయన ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌రెడ్డి, జడ్పీ జిల్లా వైస్ ఛైర్మన్ ఈట గణేష్‌లతో కలిసి ఎంపీడీఓను సన్మానించారు.

## కంకల్ గ్రామంలో పది మూగజీవాల (గొర్రెల) అపహరణ

**పూడూరు, జూన్ 29, ప్రభాతవార్త :** గుర్తు తెలియని వ్యక్తులు పది మూగజీవాలను (గొర్రెలు) దొంగిలించిన సంఘటన పూడూరు మండలం పరిధిలోని కంకల్ గ్రామంలో చోటుచేసుకుంది. చెన్‌గోముల్ ఎస్ఐ మధుసూధన్‌రెడ్డి కథనం ప్రకారం వికారాబాద్ జిల్లా పూడూరు మండలం పరిధిలోని కంకల్ గ్రామానికి చెందిన గొల్ల గాలయ్య అనేవ్యక్తి వీరభద్ర వైన్స్ ముందు ఉన్న తన పొలంలో శుక్రవారం రాత్రి మూగజీవాలు (గొర్రెలను) కట్టి ఉంచాడు. అయితే మధ్యరాత్రిలో గుర్తుతెలియని వ్యక్తులు గొర్రెల మందనుండి 7 పొట్టేళ్లు, మూడు పిల్లలను అపహరించారు. శనివారం బాదితుడు గాలయ్య పిర్యాదుమేరకు చెన్‌గోముల్ పోలీసులు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



ఎబివిపి నిరసన దీక్ష చేస్తున్న దృశ్యం

## కస్తూర్బా గాంధీ పాఠశాల భవనాన్ని వెంటనే ప్రారంభించాలి: ఎబివిపి

**కడ్తాల్,జూన్ 29 ప్రభాతవార్త :** కడ్తాల్ పట్టణ సమీపంలో ఉన్న కస్తూర్బా గాంధీ పాఠశా భవనాన్ని ప్రారంభించాలని ఎబివిపి కడ్తాల్ శాఖ ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టడం జరిగింది. కార్యక్రమాన్ని బిజెవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి కాంటేకర్ భగీరథ, కడ్తాల్ మాజీ వార్డు సభ్యులు దోనాదుల మహేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎబివిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు క్యామ శ్రీకాంత్ మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభం అయ్యి 20 రోజులు కావస్తున్నా ఇంకా కస్తూర్బా పాఠశాలలో తరగతులను ప్రారంభించలేదు. కొత్త భవనం నిర్మించినా ఇంకా ప్రారంభించకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే, అధికారులు పట్టించుకోవడం లేదు. స్థానిక ఎమ్మెల్యే, అధికారులు పట్టించుకోవడం లేదు. స్థానిక ఎమ్మెల్యేకు, ఎంపికి, మంత్రికి సమయం లేదని పాఠశాలను ప్రారంభించకుండా విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారు. గత సంవత్సరం పాఠశాల నడిచిన భవనంలో సరైన వసతులు లేక నిరుపేద విద్యార్థినులు విద్యకు దూరం అయ్యి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దాదాపు 350 విద్యార్థినిలు ఉన్న పాఠశాలలో ఇంకా తరగతులను ప్రారంభించకపోవడం చాలా బాధా కరం విద్యార్థినుల జీవితాలు ఇప్పుడు సంక్షోభంలో పడ్డాయి. ఎటు వెళ్లాలో తెలియక విద్యార్థినిలు అయోమయ పరిస్థితుల్లో ఉన్నారు. విద్యకు దూరం అవుతున్నారు. వెంటనే కస్తూర్బా గాంధీ పాఠశాల భవనాన్ని ప్రారంభించాలని అధికారులను డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎబివిపి నాయకులు సీనియర్ నాయకులు మురళి,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భరత్, రాష్ట్ర నాయకులు మల్లేష్, పవన్, మధు, శివ, ప్రవీణ్, మల్లేష్, సుమన్, అనిల్,భద్రు ఉన్నారు.

## యాదయ్య కుటుంబానికి అండగా ఉంటాం

### ఏఐసిసి కార్యదర్శి చల్లా వంశీచందర్‌రెడ్డి


యాదయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వంశీచంద్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు

**కడ్తాల్,జూన్ 29 ప్రభాతవార్త :** రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ముద్విన్ మాజీ సర్పంచ్ ఈర్లపల్లి యాదయ్య కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని ఏఐసిసి కార్యదర్శి, సిడబ్ల్యుసి సభ్యుడు, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. యాదయ్య కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మాజీ సర్పంచ్ యాదయ్య కుటుంబాన్ని శనివారం వంశీచంద్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పరామర్శించారు. యాదయ్య భార్య సువర్ణ, కుమారులు జగన్, హర్షవర్ధన్, తల్లి మైసమ్మలను ఓదార్చారు. యాదయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యాదయ్య మృతి కాంగ్రెస్ పార్టీకి ముద్విన్ గ్రామానికి తీరని లోటని వంశీచంద్‌రెడ్డి పేర్కొన్నారు. యాదయ్య మృతి తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని విచారణ వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యాదయ్య కుటుంబానికి ప్రభుత్వ పరంగా తగిన సాయం అందేలా చూస్తానని వంశీచంద్‌రెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నరసింహ ముదిరాజ్, మాజీ జడ్పీటిసి శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, డిసిసి అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నేనావత్ బిక్యానాయక్, మండల కో ఆప్షన్ సభ్యుడు జాంబీర్‌బాబా, పిఎసిఎస్ డైరెక్టర్ చేగూరి వెంకటేష్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు హీరాసింగ్, సేవాదళ్ మండల అధ్యక్షుడు గురిగల్ల లక్ష్మయ్య, ఆమనగల్లు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు జగన్, నాయకులు సురెందర్‌రెడ్డి, అశోక్, లక్పతి నాయక్, నరసింహ,మధు,సత్యనారా యణ, వెంకటేష్, మనిష్, రామచంద్రయ్య, బాలరాజు, సురేష్, జాంగిర్‌అలీ, రామచందర్ నాయక్, షాబుద్దిన్, రామకృష్ణ, శంకర్, వెంకటయ్య, కృష్ణనాయక్, పరివిద్ శ్రీశైలం, డిగ్రీ కృష్ణ పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణాలతో జీపీ ఆదాయానికి గండి

### -అధికారులు చర్యలు తీసుకోవాలి: ఎంపిపి

**ఘట్‌కేసర్, జూన్ 29, ప్రభాతవార్త:** గ్రామాల్లో అనుమతి లేకుండా కొనసాగుతున్న నిర్మాణాలతో గ్రామపంచాయతీలకు రావాల్సిన ఆదాయానికి గండి పడుతుందని ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ మండలం ఎదులాబాద్ గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈసందర్భంగా ఆయన పలు రికార్డులను పరిశీలించి అక్రమ కట్టడాలపై ఆరా తీశారు. గ్రామాల్లో అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తుండటంతో అక్రమ నిర్మాణాలు పెరిగిపోతున్నాయని పేర్కొన్నారు. పంచాయతీల్లో రశీదులు మాయమవు తున్నాయని, వందల స ంఖ్యలో అనుమతి లేకుండా జరుగుతున్న నిర్మాణాలపై అధికారులు చర్యలు తీసుకొని గ్రామ అభివృద్ధి కోసం తోడ్పాటు నందించాలని ఆయన కోరారు.

## పదవీ విరమణ పొందిన ఉద్యోగులు అనుభవాన్ని సమాజ శ్రేయస్సుకు ఉపయోగించాలి : ఎంపీ


పదవీ విరమణ పొందిన గుండ్లపోచంపల్లి మున్సిపల్ కమిషనర్ రాములును సన్మానించిన ఎంపీ ఈటల రాజేందర్

**మేడ్చల్, జూన్ 29, ప్రభాతవార్త :** పదవీ విరమణ పొందిన ఉద్యోగులు వారి అనుభవాన్ని సమాజ శ్రేయస్సుకు ఉపయోగించాలని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపల్ కమిషనర్ రాములు పదవీ విరమణ వీడుకోలు సమావేశాన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు భోజనాన్ని ఏర్పాటుచేశారు. రాములు దంపతులను సన్మానించిన అనంతరం ఎంపీ మాట్లాడుతూ ఉద్యోగిని పదవీ విరమణ తప్పదని, పదవీ విరమణ పొందడంతో జీవితం అయిపోయిందని అనుకోకుండా వారి అనుభవాన్ని సమాజ శ్రేయస్సుకు ఉపయోగించి ప్రజలకు మేలు చేసే విదంగా పాటుపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ లక్ష్మీ శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ ప్రభాకర్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షుడు విక్రంరెడ్డి, కౌన్సిలర్లు జైపాల్‌రెడ్డి, మల్లికార్జున్ ముదిరాజ్, పెంటయ్య, హేమంత్‌రెడ్డి, బాల్‌రాజ్, సరస్వతి మోహన్‌రెడ్డి, హంసరాణి, నాయకులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పాఠశాల ముందు ధర్నా నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

## పుస్తకాలు, యూనిఫామ్స్, టై బెల్టులు అమ్ముతున్న పాఠశాల గుర్తింపును రద్దు చేయాలి : ఎస్ఎఫ్ఐ

**మేడ్చల్, జూన్ 29, ప్రభాతవార్త :** నిబందనలకు విరుద్ధంగా పాఠశాలలోనె పుస్తకాలు, యూనిఫామ్స్, టై బెల్టులు అమ్ముతూ విద్యార్థుల తల్లిదండ్రులను దోచుకుంటున్న పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ మేడ్చల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కార్తిక్, సంతోష్ డిమాండ్ చేశాడు. మేడ్చల్ పట్టణంలోని కేఎల్ఆర్ వెంచర్‌లో గల సీఎంఆర్ పాఠశాల వద్ద ఎస్ఎఫ్ఐ నాయ కులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలు నిబందనలకు అతిక్రమించి పుస్తకాలు, యూనిఫామ్స్, టై బెల్టుల పేరుతో దోపిడి చేస్తున్నారని ఆరోపించారు. సీఎంఆర్ పాఠశాలలో కూడ వీటి విక్రయాలు జరుగుతున్నాయని ఎంఈవోకు తెలియజేయగా కార్యాలయ సిబ్బంది వచ్చి విక్రయాలు గదిని సీజ్ చేశారని తెలిపారు. విద్యాధికారులు, డీఈవో ఇచ్చిన సర్క్యులర్‌ను కూడ బేకాతర్ చేస్తూ ప్రైవేట్ విద్యాసంస్థలు తమ ఇష్టానుసారంగా నడుస్తున్నాయని అన్నారు. పుస్తకాలు, యూనిఫామ్స్ పేరుతో దోపిడి చేస్తున్న పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి కిరణ్, నాయకులు అరుణ్, బాలకిరణ్ పాల్గొన్నారు.

## నేడు యాచారం సహకార సంఘం సర్వసభ్య సమావేశం

**యాచారం జూన్29,ప్రభాతవార్త :** యాచారం మండలం ప్రాథమిక సహకార సంఘం సర్వసభ్య సమావేశం నిర్వహించినట్లు చైర్మన్ తొటి రెడ్డి రాజేందర్ రెడ్డి తెలిపారు. శనివారం చైర్మన్ ఓ ప్రకటనలో మాట్లాడుతూ...ఆదివారం మధ్యాహ్నం రెండు గంటలకు రాష్ట్ర సహకార సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి రైతు ప్రజాప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

## ప్రతి పాఠశాలకి మంచినీటి వసతిని కల్పించాలి : ఎంపిపి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి కొప్పు సుకన్య భాష,ఎంపిడివో,ఎంపివో

**యాచారం జూన్29,ప్రభాతవార్త :** యాచారం మండల పరిషత్ కార్యాలయంలో మిషన్ భగీరథ్ అధికారులు,పంచాయతీ కార్యదర్శిలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి సుకన్యభాష మాట్లాడుతూ...ప్రతి గ్రామంలో ఉన్నటువంటి ప్రతి పాఠశాలకు మంచినీటి కనెక్షన్స్ ఇవ్వాలని వాటి పూర్తి బాధ్యత మిషన్ భగీరథ అధికారులదే అని వారు తెలియజేశారు. కాబట్టి పంచాయతీ కార్యదర్శిలు ,స్పెషల్ అధికారులు గ్రామాలల్లో ప్రజల సమస్యలు పరిష్కరించే విధంగా ఉండాలని వారు సూచించారు. ఈ సమావేశంలో ఎంపిడివో నరేందర్ రెడ్డి,ఎంపివో మిషన్ భగీరథ మండల అధికారులు,పంచాయతీ స్పెషల్ ఆఫీసర్స్ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## హైమాస్ట్‌లైట్ల ఏర్పాటుకు నిధులు మంజూరు


సమావేశంలో చర్చిస్తున్న ఎంపిపి సుదర్శన్‌రెడ్డి

**ఘట్‌కేసర్, జూన్ 29, ప్రభాతవార్త:** గ్రామాల్లో అవసరమైన చోట్ల హైమాస్ట్‌లైట్లు ఏర్పాటు చేయిస్తామని ఎంపిపి సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఘట్‌కేసర్ మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపిడిఓ గీతారెడ్డితో కలిసి హైమాస్ట్‌లైట్ల ఏర్పాటుపై చర్చించారు. ఎంపీ లాడ్స్ నిధులు రూ.10.50 లక్షలు మంజూరు కాగా 7 హైమాస్ట్‌లైట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని ఆయన తెలిపారు. సీనియర్ సహాయకులు చిలుగూరి కుమార్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలి


పాఠశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి మొక్కలను నాటుతున్న కౌన్సిలర్ కొత్త సురేఖ భాస్కర్‌గౌడ్

**కీసర,జూన్29,ప్రభాతవార్త:** విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలని దమ్మాయిగూడ మున్సిపల్ 5వ వార్డు కౌన్సిలర్ కొత్త సురేఖ భాస్కర్‌గౌడ్ అన్నారు. శనివారం ప్రభుత్వ పాఠశాలలో కొండాపూర్‌లోని ఎంసిఓ స్టాపు వేర్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ నందూరి బాపిరాజు టీమ్ ఆద్వర్యంలో విద్యార్థులకు నోటు పుస్తకాలు, ప్లేట్ గ్లాసులు, మ్యూజిక్ సిస్టమ్‌లను అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ విద్యార్థులు మంచిగా చదివి తల్లిదండ్రులకు, విద్యార్థులకు మంచి పేరు తేవాల న్నారు. విద్యార్థులు ఉన్నత చదు వులు చదివి మంచి భవిష్యత్తును ఎంచుకోవాలన్నారు. అనంతరం విద్యా ర్థులతో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొత్త భాస్కర్‌గౌడ్, రాజు ముదిరాజు, పాండుగౌడ్, ప్రధాన ఉపాధ్యాయులు సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యాయురాలు సునీత తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అంతర్జాతీయ కెమెరా దినోత్సవ వేడుకలు

**కడ్తాల్,జూన్ 29 ప్రభాతవార్త :** మండల కేంద్రంలో విడియోగ్రఫీ, అండ్ ఫొటోగ్రఫీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా జాతీయ కెమె రా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి సం బరా లు నిర్వహించారు. మండల ఫొటోగ్రఫీ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీశైలం ఉపాధ్యక్షుడు రబ్బాని, కార్యదర్శి కిరణ్ కుమార్, నదీమ్, శివ, మహేష్, క్రిష్ణ పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE 24th ADDL. CHIEF JUDGE, CITY CIVIL COURTS AT HYDERABAD
O.S No. 210 OF 2024
BETWEEN:
**Gundamaraju Jayakrishna** S/o. Late Sri Gundamaraju Gopala Krishna Murthy, House No.2-1-434/1, Ward No. 2, Block No.1, Nallakunta, HyderabadOr at R/o. 6106 IMLAY COVE CT, SUGAR LAND, TX77479, U.S.A ...Plaintiff
AND
1. **Smt. Guntupalli Sasi,** W/o. Guntupally Rameswaram, R/o. Flat No. 102, Marks Elina Apartment, Road No.15, Snehapuri Colony, Saroornagar, Hyderabad.
2. **Smt. Bandaru Nagini** W/o. Bandaru Narasimham, R/o. Flat No. 3208, 3rd Block, Janapriya Metropolis Apts, Erragadda, Sanathnagar, Hyderabad.
3. **Smt. Chengole Meenakshi** W/o. Chengole Sravan Kumar, Above 1,2 And 3 are D/o. Late Sri Gundamaraju Gopala Krishna Murthy, Or at R/o.17,Forsythia DR, Nashua, NH 03062, U.S.A
4. **The M.R.O/Tahasildar,** Nallakunta, Hyderabad
5. **The M.R.O/Tahasildar,** Hayathnagar
6. **The M.R.O/Tahasildar,** Ibrahimpatnam
7. **All Concerned** ...Defendant/s
Please, take notice that the Plaintiff filed the abovesuitto declare the plaintiff and Defendant No.1 to 3 as the legal heirs and successors of their diseased father Late Sri Gundamaraju Gopala Krishna Murthy and late mother Smt. G. Jayalakshmi. That the Hon'ble court was directed to issue summons/notices through this publication to the above Defendants and posted the suit on **30.07.2024 at 10.30 a.m.** Therefore, we hereby advice you to appear in person or duly instructed advocate on the day, failing which the matter will be heard and decided in accordance with law in your absence.
//By order of the court//
**M/s. AMANCHARLA V. GOPALA RAO, Advocate**
203, Kamala Nivas, Street No.14, 3-6-7677?1 & A, Himayath Nagar, Hyderabad

## ఉద్యోగులకు పదవీ విరమణ సహజమే

**-జిల్లా ఎస్పి సిహెచ్ రూపేష్ చెన్నూరి**



పదవీ విరమణ పొందిన ఆర్ఎస్ఐబి హన్మంత్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎస్పి రూపేష్ చెన్నూరి

**సంగారెడ్డి టౌన్, జూన్ 29, ప్రభాతవార్త:** ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ సహజమే అని, అంకిత బావంతో విధులు నిర్వహించి విరమణ పొందిన వారిని ప్రజలు కలకాలం గుర్తించుకుంటారని జిల్లా ఎస్పి సిహెచ్ రూపేష్ చెన్నూరి అన్నారు. శనివారం సంగారెడ్డిలోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఆర్ఎస్ఐబి హన్మంత్‌రెడ్డి పదవీ విరమణ పొందిన సందర్బాన్ని పురస్కరించుకుని వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్బంగా ఎస్పి రూపేష్ చెన్నూరి హన్మంత్‌రెడ్డిని ఘనంగా సన్మానించి హన్మంత్‌రెడ్డి అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్‌లు అశోక్, వెంకటేశం, ఏఆర్ డియస్‌పి నరేందర్, ఆర్ఐ రాజశేఖర్‌రెడ్డి, రామరావ్ హన్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కురిసిన వర్షం...ఆనందంలో అన్నదాతలు

**ఝరాసంగం, జూన్ 29, ప్రభాతవార్త:** ఖరీఫ్ సీజన్ ప్రారంభం అయి రోజులు గడుస్తున్నా అనుకున్నంతగా వర్షాల కురియకపోవడంతో విత్తనాలు పెట్టిన రైతులు ఆకాశం వైపు వర్షం రాకకోసం ఎదరుచూస్తూ ఉన్న తరుణంలో శనివారం వరుణ దేవుడు కరుణించి వర్షం కురిపించడంలో అన్నదాతల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. శనివారం మధ్యాహ్నం మండల కేంద్రమైన ఝరాసంగంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో వర్షం కురువడంతో రైతులు సంబర పడుతున్నారు. పంట దిగుబ డి సవ్యంగా వచ్చేలా అవసరమైన సమయాల్లో అవసరం మేరకు వర్షం కురిపించి తమను ఆదుకోవాలని రైతులు వేడుకోవడం కానవచ్చింది.

## అధ్యాపకులు కొమ్మూరిని కలవడం సరైంది కాదు



సమావేశంలో మాట్లాడుతున్న రంజిత్‌రెడ్డి

**చేర్యాల,జూన్ 29,ప్రభాతవార్త** గర్ల్స్ హాస్టల్‌కోసం జూనియర్ కళాశాల అధ్యాపకులు కొమ్మూరిని కలవడం సరైంది కాదని ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు ఆముదాల రంజిత్‌రెడ్డి అన్నారు.శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రంజిత్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ చేర్యాల జూనియర్ కళాశాల అధ్యాపకులు ఏ అధికారంలేని జనగామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిని కలవడం సరైంది కాదని ఈ విషయంపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.సమావేశంలో తాడూరి భరత్‌కుమార్, రాకేష్, అనిల్,మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యాయామంతోనే ఆరోగ్యం పదిలం

**-జిల్లా ఎస్పి రూపేష్ చెన్నూరి**

**సంగారెడ్డి టౌన్, జూన్ 29, ప్రభాతవార్త:** ప్రతి వ్యక్తి నిత్యం వ్యాయామం చేస్తే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని జిల్లా ఎస్పి రూపేష్ చెన్నూరి అన్నారు. ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ప్రతి శనివారం పోలీసు పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే వీక్లీ పరేడ్‌ఆర్మ్‌డ్ రిజర్వ్ డిఎస్‌పి నరేందర్ ఆధ్వర్యంలో రాజశేఖరరెడ్డి, రామరావ్, హన్మిరెడ్డి, ఆర్ఐలు హోంగార్డ్ సిబ్బందితో వీక్లీ పరేడ్ నిర్వహించారు. ఈ సందర్బంగా ఎస్పీ మాట్లాడుతూ వీక్లీ పరేడ్‌తో పోలీసు సిబ్బందికి ఫిజికల్ ఫిట్నెస్ కల్గుతుందన్నారు. సిబ్బందికి సమస్యలు ఉంటే పరేడ్ నందు అధికారులకు విన్నవించుకోవాలని సూచించారు.

## జోనల్ కమిషనర్‌ను సన్మానించిన కార్పొరేటర్

**రామచంద్రాపురం, జూన్ 29, ప్రభాతవార్త:** హైద్రాబాద్ గచ్చిబౌలిలోని వెస్ట్ జోన్ జోనల్ కార్యాలయంలో శనివారం జోనల్ కమీషనర్ ఉపేందర్‌రెడ్డిని రామచంద్రాపురం కార్పోరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ మర్యాద పూర్వకంగా కలుసుకుని సన్మానించారు. రామచంద్రాపురం డివిజన్‌లోని ప్రధాన సమస్యలను వివరిస్తూ కమీషనర్‌కు కార్పోరేటర్ వినతి పత్రం అందించారు. రామచంద్రాపురం బస్ రూట్‌లో మిగిలిపోయిన సిసి రోడ్లు, హిందూ స్మశాన వాటికలో అభివృద్ధి, ఓల్డ్ రామచంద్రాపురంలో మెట్ మార్కెట్, కాకతీయ నగర్‌లో స్పోర్ట్స్ కాంప్లెక్స్, శ్రీనివాస్ నగర్ కాలనీలో మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్, మిగిలిపోయిన సిసి రోడ్డులపై కార్పోరేటర్ కమీషనర్‌కు వివరించగా ప్రత్యక్షంగా డివిజన్‌ను పరిశీలించి దశల వారిగా అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తానని కమీషనర్ హామి చేసినట్లు కార్పోరేటర్ పుష్పనగేష్ పేర్కొన్నారు.

## వాటర్ ప్లాంట్‌కు పూర్వ విద్యార్థుల సహాయం

**బెజ్జంకి, జూన్ 29, ప్రభాతవార్త:** తాము చదివిన పాఠశాలలో తాగు నీటి అవసరాల నిమిత్తం ఏర్పాటు చేస్తున్న వాటర్ ప్లాంట్‌కు తమ వంతుగా రూ.10 వేల వితరణ చేసి పాఠశాలతో తమకు ఉన్న అనుబందాన్ని చాటుకున్నారు. పూర్వ విద్యార్థులు మండల పరిధిలోని బేగంపేట గ్రామంలో గల ప్రభుత్వ ఉన్న పాఠశాలలో చదువుకున్న 2006-07 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు పాఠశాలలో తాగునీటి సౌకర్యార్థం నూతనంగా ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంటు నిర్మాణానికి రూ.10 వేల పాఠశాల హెచ్ఎం భరత్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రభాకర్, మనోహర్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, శ్రీనివాస్, ఖాలిమొద్దీన్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## రూ.25 వేల ప్రభుత్వ నిషేధ గుట్కాలు స్వాధీనం

**హుస్నాబాద్ రూరల్, జూన్ 29, ప్రభాతవార్త :** హుస్నాబాద్ పట్టణంలోని హనుమాన్ హోల్‌సెల్ కిరాణా షాపులో రాథోర్ నాకుల్ సింగ్(25) ప్రభుత్వం నిషేధించిన గుట్కాలు, అంబర్, బ్లూబుల్, సిగరెట్లు డబ్బాలను అమ్ముతున్న నమ్మ దగిన సమాచారం రావడంతో సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం హనుమాన్ హోల్‌సెల్ కిరాణా షాపులో రూ.25 వేల 624 విలువ గల గుట్కాలు, అంబర్, బ్లూబుల్, సిగరెట్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు షాపు యజమాని రాథోర్ నాకుల్ సింగ్‌పై కేసు నమోదు చేశారు.

## పరిసరాల శుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత : చైర్‌పర్సన్

**హుస్నాబాద్,జూన్29,ప్రభాతవార్త :** పరిసరాల శుభ్రత ప్రతీ ఒక్కరి బాద్యత అని మున్సిపల్ చైర్‌పర్సర్ ఆకుల రజితవెంకన్న అన్నారు. శనివారం రోజున పట్టణంలోని 7వ వార్డులో ప్రజలకు తడి,పొడి చెత్తలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ పట్టణ ప్రజలందరూ తమ ఇండ్లలో పరిశుభ్రత పాటించడంతో పాటు వ్యక్తిగత శుబ్రత పాటించాలని ఇంట్లోనే తడి, పొడి చెత్తలను వేరు చేయాలని,వేరు చేసిన చెత్తను మున్సిపల్ వాహనాలకు అందించాలన్నారు.ఇంట్లో మొక్కలు ఉన్నవారు తడి,పొడి చెత్తలతో వేరు చేసుకుని కంపోస్టు ఎరువు తయారు చేసుకుని వాడుకోవచ్చన్నారు.అంతే కాకుండా నిత్యవసర సరుకుల కోసం సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు వాడవద్దని వాటి స్థానంలో బట్టసంచులు వాడాలని సూచించారు.ప్లాస్టిక్ వాడకం వల్ల జరిగే అనర్థాలను ప్రజలకు వివరించారు.నిబందనలు ఉల్లంగించి ఎవరైనా ప్లాస్టిక్ వాడితే వారికి పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను వెంటనే విడుదల చేయాలి



మాట్లాడుతున్న కన్వీనర్ దిడ్డి సుధాకర్

**హత్నూర జూన్ 29,.ప్రభాతవార్త:** మద్యంకేసులో అక్రమంగా అరెస్టుచేసిన డిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను వెంటనే విడుదలచేయాలని అమ్ ఆద్మీపార్టీ రాష్ట్రశాఖ కన్వీనర్ దిడ్డి సుధాకర్ డిమాండ్ చేశారు. శనివారం సంగారెడ్డిజిల్లా ఆమ్ ఆద్మీపార్టీ ముఖ్యకార్యాకర్తల సమావేశం హత్నూర మండలం దౌల్తాబాద్‌సమీపంలోని ఫంక్షన్‌హాల్‌లో జరిగింది. ఈసమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హజరై మాట్లాడారు. రాజరీయంగా ఎదుర్కోలేకనే డిల్లీముఖ్యమంత్రి కేజ్రీవాల్‌పై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అధికార దర్పని యోపరుస్తూ అక్రమ కెసులు నమోదు చేయించిందని అన్నారు. కేజ్రీవాల్‌కు వ్యతిరేకంగా ఇప్పటి వరకు ఒక్క ఆధారం కూడ చూపలేకపోయిందని అన్నారు.డీల్లీ ప్రభుత్వ పాలన దేశంలోనే ఆదర్శంగా నిలిచిందని గుర్తుచేశారు.కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మాయమాటలు దేశప్రజలు నమ్మే పరిస్థితిలోలేరని అన్నారు. చార్‌సౌ పార్ అనేనినాదం ఎంత గట్టిగా వినిపించినా,ప్రజలు నమ్మలేదని గుర్తుచేశారు.ఏలాంటి తప్పుచేయని డిల్లీ ముఖ్యమంత్రి అరవింద్‌కేజ్రీవాల్‌ను బేషరతుగా విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బిజెపి ప్రజావ్యతిరేకవిధాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకుపోవాల్సిన బాద్యత పార్టీ కార్యాకర్తలపై ఉందని పార్డీ రాష్ట్ర కన్వీనర్ దిడ్డి సుధాకర్ అన్నారు.పార్టీరాష్ట్ర కోర్ కమీటి సభ్యులు బుర్ర రాములుగౌడ్,డాక్టర్ సల్మాన్ రాజులు మాట్లాడుతూ ఇండియా కూటమీలోని నాయకులపై కేంద్రం అక్రమ కేసులు బనాయిస్తుందని ఆరోపించారు.రాబోయో పార్లమెంట్ ఎన్నికల నాటికి పార్టీని మరింత బలోపేతం చేయాలని కార్యాకర్తలను కోరారు.జిల్లా పార్టీ అధ్యక్షులు మిట్టపల్లి రాజేశ్వర్ మాట్లాడుతూ జిల్లాలోని చాల నియోజకవర్గాలలో కమీటిలు ఏర్పాటు చేశామని, రాబోయో స్థానిక సంస్థల ఎన్నికలలో స్వంతంగా పోటీచేస్తామని అన్నారు. సమావేశంలో పార్టీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు హేమ,కార్యాదర్శి యమునగౌడ్,నాయకులు వాజిద్,లక్ష్మన్‌నాయక్, జర్రు బాబెల్ మెహ్మద్ నిజామొద్దిన్,సుగంధర్,మెహ్మద్ మూనీర్,మహ్మద్ ఖాలేక్ వివిద మండలాల నాయకులు,కార్యకర్తలు పాల్గోన్నారు.

# మున్సిపల్ సమావేశంలో చైర్మన్ వర్సెస్ వైస్ చైర్మన్



వాగ్వాదానికి దిగిన మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్

**మెదక్ మున్సిపాలిటీ, జూన్29 ప్రభాతవార్త:** వార్డుల్లో సమస్యలు చెబితేనే, సభ్యులు వచ్చి వినతిపత్రం ఇస్తేనే పనులు చేస్తారా, అంతా అమ్యామ్యాలు ఇస్తేనే బల్దియాలో పనులు చేస్తున్నారని మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్ చైర్మన్ చంద్రపాల్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మెదక్ మున్సిపల్ సమావేశం చైర్మన్ చంద్రపాల్ అధ్యక్షతన శనివారం జరిగింది. ఒకటవ వార్డులో ఆర్ అండ్ బీ రోడ్డు వద్ద మట్టి లేక వార్డు వాసులు ప్రమాదాల బారిన పడుతున్నారని, వెంటనే సమస్య పరిష్కరించాలని కిషోర్ అన్నారు. ఆ సమస్యపై ఫిర్యాదు చేయాలని చైర్మన్ చంద్రపాల్ సూచించారు. దీనితో ఆగ్రహించిన వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్ చైర్మన్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కౌన్సిలర్లు వార్డుల్లో సమస్యలు ఉంటే ఫిర్యాదు చేస్తేనే చెబుతారా అంటూ ప్రశ్నించారు. అమ్యామ్యాలు ఇచ్చిన వారికే సంతకాలు పెడుతున్నారని ఆరోపించారు. తప్పుడు ఆరోపణలు చేయొద్దని చైర్మన్ అన్నారు. సమావేశంలో వ్యక్తిగత విమర్శలు చేయడం సరికాదని తెలిపారు. మెదక్‌లో మున్సిపల్ చెత్త ఆటో చెడిపోతే తొమ్మిది నెలల పాటు రిపేర్ ఎందుకు చేయించలేదని, ప్రైవేట్ వాహనానికి డబ్బులు చెల్లించడం ఏమిటని నిలదీశారు, ఆటో స్పేర్ పార్ట్స్ ప్రత్యేకంగా తయారు చేసి తెచ్చారా అని అన్నారు. మున్సిపల్ నిర్లక్ష్యం వల్ల ప్రైవేట్‌కు అద్దె చెల్లించడంతో మళ్లీ రిపేర్‌కు రెండు లక్షల వరకు అయ్యిందన్నారు. ప్రత్యేక శానిటేషన్ పేరుతో 50 మంది లేబర్లను పెట్టినట్లు ప్రియంబుల్‌లో పెట్టారని, ఆ కూలీల వివరాలు, పేర్లు, ఇచ్చిన ఇండెన్ట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో ఇద్దరి మధ్య కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. దీంతో ఆగ్రహించిన వైస్ చైర్మన్ కిందకు దిగి వచ్చి కౌన్సిలర్లతో కలిసి కూర్చుకున్నారు. సభ్యులంతా లేబర్ వివరాలు చెప్పాలని కోరినా సమావేశంలో మాత్రం పెట్టలేదు. హరితహారంలో పెట్టిన మొక్కల రక్షణ కోసం ఏర్పాటు చేసిన సిబ్బంది వార్డుల్లో పర్యటించడం లేదని భీమరి కిషోర్ అన్నారు. టీయూఎఫ్ఐడీ నిధులు కొన్ని వార్డులకే ఎలా పెడతారని ప్రశ్నించారు. అవసరం ఉన్న కొన్ని వార్డులకు పెట్టామని కమీషనర్ తెలిపారు. అన్ని వార్డులకు ప్రాధాన్యత ఇస్తామని చైర్మన్ హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో కమీషనర్ జానకి రామ్ సాగర్, కౌన్సిలర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నారాయణఖేడ్ ఆర్టీసిలో డయల్ యువర్ మేనేజర్

**-సమస్యలను తెలుసుకున్న మేనేజర్**

**నారాయణఖేడ్ టౌన్, జూన్ 29, ప్రభాతవార్త:** పట్టణంలోని ఆర్టీడి డిపోలో శనివారం డయల్ యువర్ మేనేజర్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు డిపో మేనేజర్ తెలిపారు. నగధర్ రాములు పాటిల్ వట్టిపల్లి సదాశివపేట, వికారాబాద్, అనంతగిరి, క్షయవాధి హాస్పిటల్ బూరుగుపల్లి, నయాబ్ సర్కార్ దర్గా షరీఫ్ వరకు బస్సులు నడపాలని వినతి చేశారు. కడపల్ మీదుగా పిట్లంకు బస్సు సౌకర్యం కల్పించాలని మాజీ సర్పంచ్ భూమిరెడ్డి, హనుమంత్‌రెడ్డిలు సూచించారు. నారాయణఖేడ్ నుంచి మండల కేంద్రమైన న్యాల్‌కల్ మీదుగా దప్పూర్ గుండా కర్ణాటకలోని బీదర పట్టణం వరకు బస్సును నడపాలని మండల కేంద్రమైన న్యాల్‌కల్ గ్రామానికి చెందిన హోతి సిద్దన్న పేర్కొన్నారు. నారాయణఖేడ్ నుంచి న్యాల్‌కల్ మీదుగా ఝరాసంగం వరకు బస్సును నడపాలని నవీన్ కుమార్ వినతి చేశారు. కంకోల్-హైద్రాబాద్ బస్సును యదావిధిగా విద్యార్థుల గురించి కొనసాగించాలని దాము, రాజేశ్వర్, విఠల్, నాగరాజులు వినతి చేశారు. రాపోల్ గాంధీనగర్ బస్స కావాలని తడకల్ గ్రామానికి చెందిన జ్ఞానేశ్వర్ అడిగారు. కల్హేర్ నిజాంసాగర్ బస్సును పునరుద్దరించాలని నాగ్దర్ రాములు పాటిల్ చిస్త వివరించారు. నారాయణఖేడ్ సిర్గాపూర్ అంతర్గం, పిట్లంలకు బస్సును కొనసాగించాలని మహేష్ వినతి చేసినట్లు డిపో అసిస్టెంట్ మేనేజర్ నర్సింలు, పిఆర్ఓ పాండు, బస్సు పాస కౌంటర్ ఇంచార్జి సాయిలులు తెలిపారు. ఉన్నతాధికారుల దృష్టికి ప్రజల వినతులు తీసుకుపోయి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని డిపో మేనేజర్ తెలిపినట్లు వారు వివరించారు.

## కిషన్ నాయక్ తండాలో సిసి రోడ్డుకు శ్రీకారం

**నాగల్‌గిద్ద, జూన్ 29, ప్రభాతవార్త:** మండలంలోని కిషన్ నాయక్ తండా, డోల తండాల్లో సిసి రోడ్డు నిర్మాణానికి కాంగ్రెస్ నాయకులు శనివారం భూమి పూజా కార్యక్రమాలు నిర్వహించి పనుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్బంగా కాంగ్రెస్ నాయకులు మాజీ సర్పంచ్ గణపతి, మాజీ ఉప సర్పంచ్ విఠల్ జాదవ్. నాయకులు రాజు, రామ్ చందర్, శ్రావణ్‌లు మాట్లాడుతూ ఎంపి సురేష్‌కుమార్ షెట్కార్, ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డిల సహకారంతో 20 లక్షల రూపాయలతో రెండు తండాల్లో సిసి రోడ్డు పనులు ప్రారంభించామన్నారు. గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ హయాంలో జరగడం తథ్యమన్నారు.

## ఐటిఐని ఏర్పాటు చేయాలని తహసీల్దార్‌కు బిజెపి వినతి

**జహీరాబాద్, జూన్ 29, ప్రభాతవార్త:** జహీరాబాద్ పట్టణంలో ఐటిఐని ఏర్పాటు చేయాలని శనివారం భారతీయ జనతా పార్టీ నాయకులు తహసీల్దార్ ఎస్ రవీందర్‌కు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్బంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ జహీరాబాద్ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతోందని, ఐటిఐ, పారిశ్రామిక శిక్షణ సంస్థలు అత్యవసరమని గుర్తు చేశారు. ఈ పాటికే జహీరాబాద్ ప్రాంతంలో అనేక కర్మాగారాలు ఉన్నాయని, త్వరలోనే నీమ్స్‌లో పరిశ్రమలు ఏర్పడుతాయని వారు గుర్తు చేశారు. కార్యక్రమంలో బిజెపి జహీరాబాద్ నియోజకవర్గ ఇంచార్జి నౌబాద్ జగన్, నాయకులుశ్రీనివాస్ గుప్తా, సుదీర్ బండారి, నరేష్ పాటిల్, సోమ అనిల్, పూల సంతోష్, బక్కయ్య గుప్త తదితరులు పాల్గొన్నారు.

## అయిల్‌ఫామ్ తోటలు సాగు చేయడానికి రైతులు ముందుకు రావాలి

**చిన్నకోడూరు, జూన్ 29, ప్రభాతవార్త:** మండల పరిదిలోని పలు గ్రామాలలో సిద్దిపేట ఎడిఎ పద్మ శనివారం వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. మండల పరిధిలోని అల్లీపూర్, కిష్టాపూర్, మైలారం గ్రామాలలో అయిల్‌ఫామ్ తోట, అయిల్ ఫామ్ తోటలో అంతర పంటగా ప్రతి పంట వేసిన మహంకాళి శంకరయ్య వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. మొదటి 3 యేండ్లలో అదాయం కోసం అంతర్ పంటలుగా కూరగాయలు, మొక్కజొన్న, పత్తి, బొబ్బర్లు, పెసర్లు, కందులు, ఉలువలు, పొద్దుతిరుగుడు, అరటి, బొప్పాయి, వేరుశనగా పంటలు పండిచుకోవచ్చునని తెలిపారు. అయిల్ ఫామ్ మొక్కలు నాటిన తర్వాత 4 యేండ్ల కాపు మొదలై 30 యేండ్ల వరకు నిరంతరం దిగుబడితో నిరంతర అదాయం వస్తుందన్నారు. తెగుళ్లు, చీడపీడల ద్వారా తక్కువ తుఫాను, వడగండ్ల వానలను తట్టుకుంటుందన్నారు. కోతుల, అడవిపందుల, దొంగల బెడద అయిల్‌ఫామ్ పంటకు ఉండదన్నారు. అయిల్‌ఫామ్ తోటలను సాగు చేయడానికి రైతులు ముందుకు రావాలన్నారు.

## శివాలయంలో ఘనంగా ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు

**మెదక్ మున్సిపాలిటీ, జూన్29 ప్రభాతవార్త:** మెదక్ పట్టణంలోని పెద్ద బజారులో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కాశీ శివాలయంలో శనివారం ఆలయ అధ్యక్షులు సోమకృష్ణ, సంఘ కృష్ణల ఆధ్వర్యంలో ఆలయ నిర్మాణం జరిగి రెండు సంవత్సరాలు పూర్తి కావడంతో ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా ప్రారంభించారు. ఉదయం పుణ్యాహవచనం, వాస్తు పూజ, అభిషేకం నిర్వహించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ ఆలయ ద్వితీయ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా ఆదివారం ఆలయ ప్రాంగణంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు, అలాగే సోమవారం శివ పార్వతుల కళ్యాణం నిర్వహించనున్నట్లు, అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టనున్నట్లు వెల్లడించారు. కావున పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో హాజరై స్వామి కృపకు పాత్రులు కాగలరని కోరారు. ఈ కార్యక్రమంలో ఆనందం, ఆంజనేయులు, శ్రీకాంత్, అనంత్‌బాబు, వెంకటేశం, నాగరాజు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## వెల్దుర్తి పోలీస్ స్టేషన్ నుందర్శించిన తూప్రాన్ సీఐ రంగ కృష్ణ

**వెల్దుర్తి, జూన్29 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన వెల్దుర్తిలోని పోలీస్ స్టేషన్‌ను శనివారం తూప్రాన్ సీఐ రంగ కృష్ణ సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాలను, రికార్డులను పరిశీలించారు. కేసుల వివరాలను స్థానిక ఎస్ఐ నవతాగౌడ్‌ను అడిగి తెలుసుకున్నారు. తూప్రాన్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం మొదటిసారిగా వెల్దుర్తి పోలీస్ స్టేషన్‌కు రావడం జరిగిందన్నారు. పోలీస్ స్టేషన్‌కు ప్రత్యేక సౌకర్యాలు కల్పించడం కోసం త్వరలో నిధులు వస్తాయని, ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుదారులతో సిబ్బంది మర్యాదగా ఉండాలని, పోలీస్ స్టేషన్ పరిధిలో ఎలాంటి అవినీతి, అక్రమాలు జరిగినా తమ దృష్టికి తీసుకురావాలని, వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

**మృతిచెందిన హోంగార్డు కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేసిన సీఐ...**

మండల కేంద్రమైన వెల్దుర్తిలో హోంగార్డుగా పనిచేసి అనారోగ్యానికి గురై మృతి చెందని హోంగార్డు లక్ష్మీనర్సమ్మ శనివారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న సీఐ రంగ కృష్ణ బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి ఆర్థిక సహాయం అందజేశారు. ప్రభుత్వ పరంగా హోంగార్డు కుటుంబానికి వచ్చే ఆర్థిక సహాయం అందజేసి వారి కుటుంబాన్ని ఆదుకుంటామన్నారు.

## లద్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డిఎంహెచ్‌వో తనిఖీ

**చేర్యాల,జూన్ 29, ప్రభాతవార్త** మద్దూరు మండలం లద్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీఎంహెచ్‌వో డాక్టర్ పుట్ల శ్రీనివాస్ శనివారం అకస్మికంగా తనిఖీ చేశారు.వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జూన్ మాసం నుండి సమస్యాత్మక గ్రామాల్లో స్ప్రేయింగ్ ఆపరేషన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.సీజన్ వ్యాధులు సంభవించకుండా అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ఆరోగ్య కేంద్రంలో నాణ్యమైన వైద్య సేవలు ప్రజలకు అందించాలని ఐపి,ఓపి సంఖ్య పెంచాలని, డాక్టర్లు సమయపాలన పాటించాలని తెలిపారఉ.ఆయన వెంట డిపూ్యటి డీఎంహెచ్‌వో ప్రభాకర్, వైద్యాధికారి సుధీర్ రాజ్,ఆరోగ్య సిబ్బంది ఉన్నారు

## జిల్లా అధికారుల సంఘం అధ్యక్షుడిగా ప్రసాద్

**-జిల్లా కలెక్టర్‌ను కలిసిన నూతన కార్యవర్గం సభ్యులు**

**సంగారెడ్డి మున్సిపాలిటి జూన్ 29,.ప్రభాతవార్త:** సంగారెడ్డిజిల్లా అధికారుల సంఘం నూతన కార్యవర్గంను శనివారంనాడు జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఏన్నుకున్నారు.అధ్యక్షులుగా టి.ప్రసాద్ (డిసిఓ),ప్రధానకార్యధర్శిగా జగద్వీశర్(బిసి వెల్ఫర్ అధికారి),కోశాదికారిగా టి.అఖిలేష్‌రెడ్డి(డిడిఎస్‌డబ్ల్యూ), ఉపాధ్యాక్షులుగా వనజ(డిసిఎస్ఓ), జగదీశ్వర్(ఇఇపిఆర్),సహాయకార్యాదర్శులుగా సి.శ్రీధర్‌బాబు (డిఎఫ్ఓ), పి.మురళీ(డిడి డైరీ),కార్యానిర్వాహక కార్యాదర్శిగా టి.సాయిబాబా (డిపిఓ), సలహదారుగా జానకిరెడ్డి(సిఇఓ),ఎం.జ్యతి(డిఆర్‌డిఓ) కార్గావర్గసభ్యులుగా నర్సింహ్మరావు(డిఏఓ),ప్రశాంత్(డిఎం ఇండస్ట్రీస్),నవీన్‌చంద్ర( ఇఎస్), రామచారి(ఇడిఎస్సీ),గీత(పిడి పెప్మా)లు ఏక గ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన ఎన్నికైన కార్యవర్గం సభ్యులు జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతిని మర్యాదపూర్వకంగా కలిశారు.

## ట్రాలీ ఆటో దొంగిలించిన దొంగ అరెస్ట్

**గజ్వేల్, జూన్ 29 (ప్రభాతవార్త):** ట్రాలీఆటో దొంగిలించడంతో పాటు పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఏటిఎం పగలగొట్టి దొంగతనానికి ప్రయత్నించిన నిందితున్ని గజ్వేల్ పోలీసులు అరెస్ట్ చేశారు. గజ్వేల్ సిఐ సైదా తెలిపిన వివరాల ప్రకారం రాయపోల్ మండలం అంకిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన మహమ్మద్ అలీబాబా(26) ఈనెల 26వ తేదీన రాత్రి గజ్వేల్ పట్టణానికి చెందిన నేతి నాగరాజుకు సంబంధించిన ట్రాలీఆటో ఎత్తుకెళ్ళి అదేరోజు రాత్రి పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఏటిఎంను పగులగొట్టి డబ్బులను ఎత్తుకెళ్ళే ప్రయత్నంచేసి విఫలం కావడంతో పారిపోయాడు. సమాచారం అందుకున్న సిఐ సైదా, అడిషనల్ ఇన్‌స్పెక్టర్ ముత్యంరాజులు సిబ్బందితో కలిసి పరిశోధన ప్రారంభించారు. టెక్నాలజీ ఉపయోగించి నిందితున్ని పట్టుకొని దొంగిలించిన ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితునిపై కేసు నమోదుచేసి జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపించినట్లు తెలిపారు. కేసును చేధించిన సిఐ సైదా, అడిషనల్ ఇన్‌స్పెక్టర్ ముత్యంరాజు, క్రైమ్ పార్టీ సిబ్బందిని గజ్వేల్ ఏసిపి పురుషోత్తంరెడ్డి అభినందించారు.

## ఇసుక ట్రాక్టర్ పట్టివేత

**వెల్దుర్తి, జూన్29 ప్రభాతవార్త:** మండలంలోని ఎం. జలాల్‌పూర్ గ్రామం నుండి ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తలిస్తున్న ట్రాక్టర్‌ను శనివారం స్థానిక పోలీసులు పట్టుకున్నారు. ఆ గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ బాలరాజుతో పాటు ట్రాక్టర్ యజమానిపై అక్రమంగా ఇసుకను తరలిస్తున్నందుకు కేసు నమోదు చేయడం జరిగిందని స్థానిక ఎస్ఐ నవతాగౌడ్ తెలిపారు.

## నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే కఠిన చర్యలు

**పెద్దశంకరంపేట, జూన్29 ప్రభాతవార్త:** నిబంధనలను ఉల్లంఘించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పెద్దశంకరంపేట ఎస్ఐ శంకర్ తెలిపారు. రెండవ రోజు శనివారం కూడా పట్టణంలో స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన ధృవపత్రాలు లేని 17 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసిన పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ శంకర్ మాట్లాడుతూ నెంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపితే ఆ వాహనాన్ని సీజ్ చేస్తామని హెచ్చరించారు. వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు వాహనానికి సంబంధించిన అన్ని ధృవపత్రాలు కలిగి ఉండాలన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, మద్యం తాగి వాహనాలు నడపవద్దని ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ సునీతతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## బేకరీ యజమానికి రూ.10వేల జరిమానా

**గజ్వేల్, జూన్ 29 (ప్రభాతవార్త):** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లో గల బెంగుళూరు అయ్యంగార్ బేకరీలో కుల్లిపోయిన కేకులు, కాలంచెల్లిన కూల్‌డ్రింక్స్ అమ్ముతున్నారని ఫిర్యాదు రావడంతో శనివారం మున్సిపల్ కమిషనర్ ఆదేశాలతో అధికారులు అట్టి బేకరీలో తనిఖీ చేశారు. బేకరీలో కుల్లిన కేకులు, కాలంచెల్లిన కూల్‌డ్రింక్స్ ఉండడంతో వాటిని స్వాధీనం చేసుకొని చెత్త వాహనంలో పడవేశారు. అనంతరం బేకరీ యజమానికి రూ.10వేల జరిమానా విధించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య మాట్లాడుతూ పట్టణంలో ఉన్న హోటళ్లలో, బేకరీలలో నాణ్యత లేకుండా ఆహార పదార్థాలను వినియోగదారులకు విక్రయించినట్లయితే 2019 మున్సిపల్ చట్టం ప్రకారం వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.

## పాఠ్యపుస్తకాల అధిక ధరలపై చర్యలు తీసుకోవాలి : బిఆర్ఎస్‌వి



విలేకరులతో మాట్లాడుతున్న బిఆర్ఎస్‌వి నాయకులు

**సిద్దిపేట అర్బన్, జూన్ 29, ప్రభాతవార్త:** అధిక ధరలకు పాఠ్యపుస్తకాలు అమ్ముతున్న బుక్ డిపోలపై చర్యలు తీసుకోవాలని బిఆర్ఎస్‌వి సిద్దిపేట పట్టణ మాజీ అధ్యక్షులు పెర్క బాబు, సోషల్ మీడియా సతీష్, పట్టణ అధికార ప్రతినిధి మెరుగు మాధవ్‌లు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలోని వివిధ ప్రైవేటు పాఠశాలలు యజమానులు బుక్ డిపోలతో కుమ్మక్కై ఎమ్మార్పీ ధరల కంటే ఎక్కువ ధరలకు పాఠ్యపుస్తకాలు అమ్ముతున్నారని తెలిపారు. ప్రైవేటు పాఠశాలల్లో అధిక ఫీజులకు తోటు పాఠ్యపుస్తకాల అధిక ధరలు మరింత భారంగా మారయన్నారు. విద్యా చట్టాలను తుంగలో తొక్కి కొన్ని విద్యా సంస్థల యజమానులు పాఠశాలల్లోనే పాఠ్యపుస్తకాలు అమ్ముతూ అధిక దోపిడికి పాల్పడుతున్నారని తెలిపారు. సంబంధిత విద్యాశాఖ అధికారులు అధిక ధరలకు పాఠ్యపుస్తకాలు విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కర్రోళ్ల సతీష్, మెరుగు మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మణ్ బాపూజీ అవార్డుకు దరఖాస్తులు ఆహ్వానం

**సంగారెడ్డి టౌన్, జూన్ 29, ప్రభాతవార్త:** ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అవార్డును అందుకునేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఆగస్టు 8న జాతీయ చేనేత దినోత్సవంను పురస్కరించుకుని చేనేత కళాకారులకు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజి రాష్ట్ర అవార్డులను ఔత్సాహికుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. చేనేత కళాకారులకు, చేనేత డిజైనర్లకు వృత్తిలో నైపుణ్యత ప్రత్యేకతల ఆధారంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. అవార్డు గ్రహీతలకు 25వేల రూపాయల నగదు, మెమోంటో, సర్టిఫికెట్‌లను అందించి సత్కరించడం జరగుతుందన్నారు. అవార్డులకు ధరఖాస్తు చేసుకునే వారు 31 డిసెంబరు 2023 నాటికి 30 సంవత్సరాల వయసు నిండి చేనేత రంగంలో 10 సంవత్సరాలకు తగ్గకుండా అనుభవం కలిగి ఉండాలన్నారు. నూపుణ్యతను దాటే నమూనాలను సహాయ సంచాలకులు చేనేత, జైళీ శాఖ సంగారెడ్డి కార్యాలయంలో జూన్ 10వ తారీఖు లోగా ధరఖాస్తులను సహాయ సంచాలకులు చేనేత, జౌళి శాఖ సంగారెడ్డి కార్యాలయంలో ధరఖాస్తులు అందచేయాలన్నారు.

## వానా కాలం షురూ -తొలగని చెత్తాచెదారం

**-భయాందోళనలో మండల ప్రజలు**

**నాగల్‌గిద్ద, జూన్ 29, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన నాగల్‌గిద్దతో పాటు మండలంలోని ఎస్కి, శిఖర్ ఖానా తదితర గ్రామాల్లో అపరిశుభ్రత నెలకొంది. వర్షాకాలం ప్రారంభం కావడం గ్రామాల్లోని మురుగు కాల్వలను పరిశుభ్రం చేయకపోవడంతో కాల్వల్లో చెద్దచెదారం పేరుకుపోవడంతో దోమలు, ఈగలు స్వైరవిహారం చేస్తున్నారు. పరిసరాలను అపరిశుభ్రంగా ఉండటంతో తామెక్కడ అనారోగ్యానికి గురవుతామోనని ఆయా గ్రామాల ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల బాద్యతలను ప్రభుత్వం ప్రత్యేక అధికారులకు అప్పగించిన తమకేం పట్టనట్లుగా అధికారులు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వివనస్తున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి గ్రామాలు పరిశుభ్రంగా ఉండేలా తగు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## పరిమితి లేకుండా రైతు భరోసా ఇవ్వాలి

**పాపన్నపేట, జూన్ 29, ప్రభాతవార్త:** భూ పరిమితి విధించకుండా రైతులందరికి రైతు భరోసా ఇవ్వాలన అన్నదాతలు డిమాండ్ చేశారు. శనివారం ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల పరిధిలోని చీకోడ్ గ్రామంలో రైతు భరోసా పథకంపై ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. సమావేశానికి జిల్లా వ్యవసాయ అధికారి గోవిందు, సొసైటీ చైర్మన్ దత్తరాజు అధ్యక్షత వహించారు. అన్నదాతలందరికి రైతు భరోసా కింది డబ్బులు అందచేయాలని కొందరు, 5 ఎకరాల వరకు సీలింగ్ విధించాలని మరికొందరు సూచించారు. పంటలను సాగు చేసే భూమి గల రైతులకు 10 ఎకరాల వరకు సీలింగ్ విధించి రైతు భరోసా అందచేయాలని మరికొందరు రైతులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. రైతులు అందించిన తమ అభిప్రయాలను రాష్ట్ర ప్రభుత్వాని అందచేస్తామని డిపిఓ తెలిపారు. కార్యక్రమంలో సహకార శాఖ అల్లాదుర్గం క్లస్టర్ ఇంచార్జి, సహకార సంఘం అసిస్టెంట్ రిజిస్టర్ ఫైజుద్దీన్, మండల వ్యవసాయ అధికారి నాగం కృష్ణ, ప్రశాంత్, రైతులు పాల్గొన్నారు.

## అవినీతిపై విచారణ చేపట్టిన అసిస్టెంట్ రిజిస్టర్

**రామచంద్రాపురం, జూన్ 29, ప్రభాతవార్త:** రామచంద్రాపురం మండలం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్ నగర్ ఎంఐజి ఎంప్లాయిస్ కో-ఆపరేటివ్ హౌజింగ్ సొసైటీలో నిధుల గోల్‌మాల్‌పై పటాన్‌చెరు అసిస్టెంట్ రిజిస్టర్ ఎన్ రామకృష్ణ శనివారం విచారణ నిర్వహించారు. హౌజింగ్ సొసైటీ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులను ఫిర్యాదుపై వివరణ అడిగి రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్బంగా అసిస్టెంట్ రిజిస్ట్రార్ రామకృష్ణ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్‌కు కొందరు సభ్యులు చేసిన ఫిర్యాదు మేరకు కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశాల మేరకు జిల్లా సహకార అధికారి తుమ్మ ప్రసాద్ సూచనల మేరకు విచారణ చేపట్టినట్లు పేర్కొన్నారు. పలు రికార్డులను రెండు, మూడు రోజుల్లో అందిస్తామని సొసైటీ కమిటీ సభ్యులు తెలిపారన్నారు. విచారణ నిర్వహించి ఉన్నతాధికారులకు నివేదిక అందచేస్తామన్నారు. ఈ సందర్బంగా ఎంఐజి హౌజింగ్ సొసైటీ అధ్యక్షుల ఎస్ అబ్దుల్ అజీమ్ మాట్లాడుతూ గత కమిటి సభ్యులు తమ కమిటీపై నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారన్నారని విచారం వ్యక్తం చేశారు. కానీ అభివృద్ధికి అన్ని రకాలుగా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. గత కమిటీలో అవకతవకలు జరిగాయని, అసిస్టెంట్ రిజిస్ట్రార్‌తో విచారణ చేపిస్తామని అబ్దుల్ అజీమ్ హెచ్చరించారు.

## అభివృద్ధి పనులకు రూ.2 కోట్ల ప్రతిపాదనలు

**-కమిషనర్‌కు కార్పోరేటర్ సింధూ వినతి**

**రామచంద్రాపురం, జూన్ 29, ప్రభాతవార్త:** శేరిలింగంపల్లి జోనల్ కార్యాలయంలో 2 కోట్ల అభివృద్ధి పనుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని భారతి నగర్ కార్పోరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి జోనల్ కమీషనర్ ఉపేందర్‌రెడ్డికి శనివారం వినతి పత్రం అందచేశారు. ఈ సందర్బంగా కార్పోరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్మి మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని పోచమ్మ ఆలయం పక్కన నూతనంగా నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్ నిర్మాణం పూర్తఅయ్యేందుకు 95 లక్షల రూపాయల అదనపు నిధులు అవసరమని, అందుకు నిధులను మంజూరు చేయాలన్నారు. టెండర్‌లు పిలిచి నిర్మాణ పనులు ప్రారంభింఆచలని కోరామన్నారు. బిడిఎల్ కాలీ, మ్యాక్స్ వెల్‌సొసైటీలో ప్రహరి గోడ, ఎస్ఐ రోడ్డులో అంబేద్కర్ విగ్రహం నుంచి భేల్ ఎంఎంటిఎస్ వరకు చైన్ లింక్ మేష్, మ్యాక్ సొసైటీ కాలనీలో మిగిలిన కమ్యూనిటీ హాల్ పనులకు, ఎంఐజి కాలనీలో కల్వర్లులకు ప్రతిపాదనలు అందచేసినట్లు, నిధుల మంజూరుకు కమీషనర్ సానుకూలంగా స్పందించినట్లు కార్పోరేటర్ సింధూ ఆదర్శ్‌రెడ్డి వివరించారు.

## అండర్‌పాస్ నిర్మాణ స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే



**అత్తాపూర్ జూన్29,ప్రభాతవార్త :** నియోజకవర్గ ప్రజల అవసరాలను తీర్చడమే లక్ష్యమని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు.గగణపహాడ్ వద్ద పాదాచారులకు జాతీయ రహదారి దాటుటకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని పలుమార్లు స్థానికులు ఎమ్మెల్యేకు విన్నవించడంతో శనివారం ప్రజల సౌకార్యర్థం నిర్మిచా తలపెట్టిన అండర్‌పాస్ నిర్మాణ స్థలాన్ని ఎన్‌హెచ్ఎఐ నేషనల్ హైవే అధికారులతో కలిసి ఎమ్మెల్యే సందర్శించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ....త్వరలోనే అండర్ పాస్ నిర్మాణ పనులు చేపట్టి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు,తదితరులు పాల్గొన్నారు.